

500 అభ్యర్థుల ధృవపత్ర పరిశీలన

నవ తెలంగాణ మహబూబ్ నగర్

పోలీస్ కానిస్టేబుల్,ఎస్సై అభ్యర్థుల సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ప్రక్రియ లో భాగంగా 8వ రోజు 460 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించినట్లు జిల్లా ఎస్పీ కె.నరసింహ తెలిపారు. గురువారం జిల్లా నుండి ఎస్సై మరియు కానిస్టేబుల్ ఉద్యోగాల కొరకు వ్రాత పరీక్షా అర్హత పొందిన అభ్యర్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కొనసాగించడం జరిగిందన్నారు. జిల్లా పరిధిలో మొత్తం 500 మంది అభ్యర్థులకు గాను 460 మంది అభ్యర్థులకు ధ్రువపత్రాలను పరిశీలించామని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు, ఏ.ఓ రుక్మిణి బాయి, సాయుధ దళ డిఎస్పీ శ్రీనివాసులు, స్వాతి గౌడ్, సుపెరిండెంట్ యెహోవా దాస్, ఐటీ సెల్ సిబ్బంది, పరిపాలన విభాగం సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ స్పోక్ పర్సన్ గా జహీర్



మహబూబ్ నగర్ : తెలంగాణ కాంగ్రెస్ పార్టీ గురువారం రాష్ట్రంలోని 33 జిల్లాల సంబంధించిన పార్టీ స్పోకు పర్సనల్ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్ రెడ్డి ప్రకటించారు. అందులో జిల్లాకు చెందిన జహీర్ అక్తర్ కు చోటు దక్కింది. ఇతను ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులుగా, యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా, పార్టీ జిల్లా కార్యదర్శిగా పనిచేసిన అనుభవం ఉన్నది. ప్రస్తుతం పార్టీ మైనార్టీ సెల్ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి వస్తున్న ఎన్నికలలో పార్టీకి గట్టినా స్పోక్ పర్సన్ లను నియమించడం జిల్లా నుండి ఇతనికి అవకాశం దక్కడం పార్టీ బలోపేతానికి ఎంతో తోడ్పాటు అవుతుందని పార్టీ నాయకులు చెబుతున్నారు.

సొంతింటి కల కలెనా ?

- రెండు పడకల నుంచి గృహలక్ష్మి దాక
- ఐదు లక్షల నుండి మూడు లక్షలకు తగ్గిన ఆర్థిక సహాయం
- పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బడ్జెట్ కరువు
- ఆందోళనలో లబ్ధిదారులు



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు చూస్తుంటే... పంచపాండవులు మంచం కోళ్లవలే అనే సామెత గుర్తుకొస్తోంది. 2018లో జరిగిన ఎన్నికలలో రెండు పడకల గదుల కోసం రూ.5 లక్షలు ఖర్చు చేసి ప్రతి ఒకరికీ సోతింటి కల నేరవేరుస్తామని పాలకులు గొప్పలు చెప్పారు. ఈపథకం కింద ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో ఇళ్ల నిర్మాణం జరగలేదు. ఇది పూర్తిగా అమలు కాకముందే ఇంటికోసం ఖర్చు చేసే బడ్జెట్‌ను మూడు లక్షలకు తగ్గించి నూతనంగా తీసుకొచ్చిన పథకానికి గృహలక్ష్మి అనే పేరు పెట్టారు. పెరుగుతున్న ధరలకు అనుకూలంగా బడ్జెట్ పెంచాలి తప్ప తగ్గించడమేమిటని పలు పార్టీల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

డబల్‌బెడ్ రూములను నిర్మించి ఇస్తామని హామీ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది. కిచెన్, హాల్, రెండుపడకలతో పాటు మౌళిక వసతులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లా కేంద్రాలలో తప్ప ఏ ఒక్క గ్రామంలో రెండు పడకల గదుల నిర్మాణాలు చేపట్టలేదు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సర్వే ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లాలో 1.50 లక్షలు , మహబూబ్‌నగర్ జిల్లాలో 1.35 లక్షలు నారాయణపేటలో 1.45 లక్షలు, గద్వాలలో 87 వేలు, వనపర్తి జిల్లాలో 50 వేలకు పైగా సొంతిళ్లు లేని నిరు పేదలున్నారు. వీరందరికి ఇంటి నిర్మాణం చేసి ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో 8 వేలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 2600, వనపర్తిలో 3500, గద్వాల నారాయణపేట జిల్లాలో 5వేల ఇండ్లను మాత్రమే నిర్మించారు. వాటిలో ఇప్పటి వరకు పాక్షికంగానే లబ్దిదారులకు అందజేశారు. ఈపథకం పురోగమణంలో ఉండగానే సొంతిటి కలలపై నీళ్లు చల్లారు. ఐదు లక్షల బడ్జెట్ స్థానంలో గృహలక్ష్మి పేరుతో మూడు లక్షల పథకాన్ని తీసుకొచ్చారు.

పెరగిన ధరలు, తగ్గిన బడ్జెట్

డబల్ బెడ్‌రూములకు కెటాయించే నిధులు సగానికి తగ్గాయి. పెరుగుతున్న ధరలకు అనుకూలంగా బడ్జెట్ కెటాయించాల్సింది పోయి తగ్గించారు. స్టీల్ క్వింటాలు 8 వేలు, సిమెంటు బాస్తా రూ. 4 వందలు, ఇటక ట్రాక్టరు రూ. 18 వేలు అయ్యింది. వీటికి 10 శాతం ధరలు పెరిగాయి. మెస్త్రీలకు అయ్యే ఖర్చు సైతం పెరిగి పోయింది. ఈపరిస్థితులలో బడ్జెట్‌ను తగ్గిస్తే..ఇంటి నిర్మాణం జరగడం కష్టంగా ఉంటుంది. ముఖ్యంగా పథకం పేరు మార్చి నిధుల తగ్గించడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్రమంగా ఇంటి నిర్మాణ బారం నుండి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

మహిళలు లేకుంటే ఎలా

తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే గృహ లక్ష్మి పథకం ప్రారంభించి కొత్త నిబంధనలు తెచ్చారు. గతంలో ఇంటిలో ఎవరికైనా సరే ... ఇల్లు కెటాయించేవారు. ఇప్పుడు ఇంటిలో మహిళకే ఇల్లు కెటాయిస్తామని నిబంధనలు తెచ్చారు. అయితే ఇంటిలో గృహిణి లేకుంటే ఎలా ఆ కుటుంభానికి పథకం వర్తించదా అంటూ..చర్చ జరుగుతోంది.ప్రమాదంలో వ్యాదిసోకి చనిపోయిన ఆ కుటుంభానికి ఇక సొంతింటి కల నెరవేరదా అంటూ... ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

సొంతింటి నిర్మాణం పట్ల స్పష్టమైన వైఖరి ప్రకటించాలి

తెలంగాణ ప్రభుత్వం సొంతింటి నిర్మాణం విషయంలో పూటకో విధానం తెస్తోంది. గతంలో రెండు పడకల నిర్మాణానికి రూ.ఐదులక్షలు ఇచ్చేవారు.దీన్ని వెనక్కి తీసుకున్నారు. పెరుగుతున్న ధరలకు అనుకూలంగా బడ్జెట్ కెటాయించాల్సింది పోయి మూడు లక్షలకు తగ్గించారు. పాలకుల విధానాలు చూస్తుంటే క్రమంగా ఈపథకానికి ముగింపు పలికే విదంగా కనిపిస్తోంది. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అభివృద్ధిని ప్రచారం చేసుకోవడం ఎవరికి ఎటువంటి అభ్యంతరం లేదు. అయితే సమస్యలను గుర్తించి పరిష్కారం కోసం ప్రయత్నిస్తే.. సంతోషంగా ఉండేది. ఇంటి స్థలాలు, రేషన్‌కార్డులు, ఇంటి జాగాలు లేనివారు ఇంటి నిర్మాణం అవసరం తదితర అంశాలపై ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సర్వేను నిర్వహిస్తున్నాం. ఈనెల 26,27న తహశీల్దార్ కార్యాలయాల్లో , జులై 3న కలెక్టర్ కార్యాలయాల్లో వినితి పత్రం అందజేయనున్నాం. సమస్యలు పరిష్కారం చేయకపోతే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం.

కిల్లె గోపాల్, సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు

తెలంగాణ తొలి నవల "ఆశాదోషం"

నవతెలంగాణ-మహబూబ్ నగర్



భారత జాగృతి నిర్వహించిన తెలంగాణ సాహిత్య సభల్లో పాలమూరు జిల్లాకు చెందిన పరిశోధకులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ పత్రసమర్పణ చేశారు. జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని తెలంగాణ సారస్వత పరిషత్ లో బుధ, గురువారాల్లో తెలంగాణ సాహిత్య సభలను నిర్వహించారు. ఈ సాహిత్య సభల్లో భీంపల్లి శ్రీకాంత్ "తెలంగాణ నవలా సాహిత్యం (1900-1932)" అనే అంశంపైన పత్రసమర్పణ చేశారు. తెలంగాణ నవల ఆవిర్భావ, వికాసాల గురించి తెలియజేశారు. తెలంగాణ తొలి నవల "ఆశాదోషం" పాలమూరు జిల్లాలోనే పురుడు పోసుకున్నదన్నారు. తొలి తెలంగాణ మాసపత్రిక "హితబోధిని" ని తీసుకువచ్చిన బరారు శ్రీనివాస్ శర్మ నే ఆశాదోషం నవలను రచించారన్నారు. అనంతరం సభాధ్యక్షులు, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మెమెంటో, శాలువా, ప్రశంసాపత్రం లతో భీంపల్లి శ్రీకాంత్ ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా విచ్చేసిన శాసనమండలి సభ్యులు, గాయకులు దేశపతి శ్రీనివాస్, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అయాచితం శ్రీధర్, చారిత్రక పరిశోధకులు కుర్రా జితేంద్రబాబు, ప్రముఖ కవయిత్రి అనిశెట్టి రజిత, తంగేడు పత్రిక సహసంపాదకులు డాక్టర్ కాంచనపల్లి రాజు, జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, వ్యాఖ్యాత ఘనపురం దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు జీతాలు పెంచాలి : సీఐటీయూ



నవ తెలంగాణ- మహబూబ్ నగర్

రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న అంగన్వాడీలకు జీతాలు పెంచాలని అంగన్వాడీ టీచర్స్ అండ్ వెల్ఫేర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి డిమాండ్ చేశారు.శుక్రవారం తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న జాత జిల్లా కేంద్రానికి చేరింది టౌన్ హాల్ చేరిన సందర్భంగా అంగన్వాడీ టీచర్లు ఘనస్వాగతం పలికి అక్కడ జరిగిన బహిరంగ సభను ఉద్దేశించి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి మాట్లాడుతూ ఐసీడీఎస్ కు బడ్జెట్ పెంచాలని, అంగన్వాడి ఉద్యోగుల కనీస వేతనం 26000 అమలు పరచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాటిటీ అమలు చేయాలని అంగన్వాడీ ఉద్యోగులకు 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసుల ప్రకారం కనీస వేతనము, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. నూతన విద్యావిధన చట్టాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న టీఏడీఏలు కూరగాయల బిల్లులు ఇంటి అద్దెలు తదితర వాటినే తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం బిజెపి ఐసిడిఎస్ వ్యవస్థను నిర్వీర్య పరచాలని, ప్రైవేటీకరించాలని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించాలని చేస్తున్న ప్రయత్నాలను సంఘం అడ్డుకొని ముందుకు వెళుతుందని ,బిజెపికి బుద్ధి చెబుతామని ఆమె హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా సీనియర్ నాయకులు కిల్లే గోపాల్ ,జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి మాట్లాడుతూ అంగన్వాడి సమస్యలు పరిష్కరించకపోతే జులై 10న పెద్ద ఎత్తున నల్ల చీరలతో కలెక్టరేట్లను ముట్టడిస్తామని, అంగన్వాడి వర్కర్లు పోరాట స్ఫూర్తితో హక్కులు సాధించుకోవాలని సిడిపిఓ లా సూపర్వైజర్ల వేధింపులను ఆపాలని వారు డిమాండ్ చేశారు .లేనిచో సిఐటియూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.రాష్ట్ర నాయకురాలు మంజుల మాట్లాడుతూ అంగన్వాడీల ఐక్యమత్యంతో పోరాడాలని అధికారుల వేధింపులను వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పుష్ప, సరోజ కవిత ,గౌస్య బేగం ,గంగాభవాని మహిమద తదితరులు మాట్లాడుతూ హక్కుల కోసం ఎంతైనా తెగించి పోరాడుతామని బెదిరింపులకు బెదిరేది లేదని ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు జీతాలు పెంచాలని వేధింపులు ఆపాలని పని భారం తగ్గించాలని ఆన్లైన్ పనులు ఆపాలని ఇట్లాంటి విధానాలు మానుకోపోతే ఉధృత పోరాటాలు చేపడతామని వారు హెచ్చరించారు. అంగన్వాడి జాతకు సంఘీభావంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వరద గలెన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ ,భవన నిర్మాణ కార్మిక సంఘం టౌన్‌అధ్యక్ష కార్యదర్శులు ఎర్ర వెంకటయ్య వరద లక్ష్మయ్య సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు వి కురుమూర్తి, సిఐటియు పట్టణ నాయకులు రాజ్ కుమార్ తదితరులు మాట్లాడారు ఇందులో కమల, లీలావతి, పద్మ ,సంగీత తదితరులు పాల్గొన్నారు .

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



నవతెలంగాణ- రాజాపూర్

రాజపూర్ మండలంలోని తిర్మలపూర్ గ్రామములో మాలగాళ్ల శరత్ కుమార్(22) మరణించారు. ఈ విషయాన్ని యువసేన సభ్యులు యువనేత చించోడ్ అభిమన్యు రెడ్డికి తెలిపారు. వెంటనే ఆయన స్పందించి బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. అంత్యక్రియల ఖర్చుల కోసం 5000/- రూపాయల ఆర్థిక సాయన్ని యువసేన నాయకుల ద్వారా అందించారు.ఈ కార్యక్రమంలో అభిమన్యు యువసేన మండల అధ్యక్షులు రామకృష్ణ గౌడ్, యువత మండల అధ్యక్షులు బంగారి వెంకటేష్ పార్టీనాయకులు, గ్రామస్తులు, యువసేన సభ్యులు చంద్రయ్య, నర్సిములు కావాలి రాజు, సురేందర్ రెడ్డి, నరసింగరావు, సత్యం, నరసింహ, సాయిలు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్ : రాజాపూర్ మండల కేంద్రంలో హన్మగళ్ల రాములమ్మ(77) అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయన్ని యువసేన సభ్యులు యువనేత చించోడ్ అభిమన్యు రెడ్డికి తెలిపిన వెంటనే స్పందించి వారి మృతి పట్ల సంతాపాన్ని ప్రకటించి, అంత్యక్రియలకు 5000/- రూపాయల ఆర్థిక సహాయన్ని యువసేన నాయకుల ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు హన్మగళ్ల నర్సింహులు, అభిమన్యు యువసేన ఉపాధ్యక్షులు సున్నం శ్రీనివాస్, హన్మంత్, పల్లె తిరుపతి, రాజు, శ్రీశైలం, రాజు, మరియు గ్రామస్తులు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కవితకు వేగుచుక్క ను అందించిన లక్ష్మణ్ గౌడ్

నవ తెలంగాణ- మహబూబ్ నగర్

జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కవి కే లక్ష్మణ్ గౌడ్ రచించిన వేగుచుక్క సంపుటి పుస్తకాన్ని ఎమ్మెల్సీ కవితకు అందజేశారు. గురువారం హైదరాబాదులో జరుగుతున్న భారత సాహితి సభలలో ఈ పుస్తకం అందించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె కవి లక్ష్మణ్ గౌడ్, అభినందించారు.



క్రీడల్లో తెలంగాణ దూసుకుపోతోంది

- క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రదానం
- మంత్రి శ్రీనివాస్ గౌడ్
- అసెంబ్లీలో తెలంగాణ అనే పదం ఉచ్చరించనివ్వలేదు
- ఉద్యమకారులపై కేసులు పెట్టి వేధించారు
- అమరవీరుల త్యాగాల ఫలితంగా రాష్ట్రం సిద్ధించింది



మహబూబ్ నగర్ : దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, క్రీడలు, యువజన సర్వీసులు, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి డాక్టర్ వి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ క్రీడల్లో దూసుకు పోతోందన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బి అతిథి గృహం ఆవరణలో జరిగిన అమరవీరుల దినోత్సవ వేడుకల అనంతరం మాచన్ పల్లి తండాలో నిర్వహించిన వి.ఎం.ఆర్ క్రికెట్ టోర్న మెంట్ లో విజేతలకు మంత్రి బహుమతులను అందజేశారు. ఈనెల 18 నుంచి మూడు రోజులపాటు మాచన్ పల్లి తండాలో నిర్వహించిన వి.ఎం.ఆర్ క్రికెట్ టోర్నమెంట్ లో ప్రథమ స్థానం సాధించి విజేతగా నిలిచిన చంద్రశేఖర్ ఎలెవెన్ క్రికెట్ జట్టుకు ట్రోఫీ, రూ. 25వేల నగదు అందించారు. క్రీడారంగంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని... క్రీడాకారులకు అద్భుతమైన సౌకర్యాలను కల్పించడం వల్ల నికత్ జరీన్ వంటి క్రీడా ఆణిముత్యాలు వెలుగులోకి వస్తున్నారని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, ముడా చైర్మన్ గంజి వెంకన్న, లైన్స్ క్లబ్ చైర్మన్ నటరాజ్, బి ఆర్ ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, సర్పంచులు శోభా, మంగమ్మ, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్ నగర్ : తెలంగాణ రాష్ట్ర సాధన సమయంలో అసెంబ్లీలో తెలంగాణ అనే పదాన్ని ఈ ప్రాంత ఎమ్మెల్యేలు ఉచ్చరించడానికి కూడా అప్పటి సమైక్య పాలకులు అంగీకరించలేదని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, క్రీడలు, యువజన సర్వీసులు, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి డాక్టర్ వి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి చౌరస్తా లోని అమరవీరుల స్థూపం వద్ద అమరులకు పుష్ప గుచ్చాలతో నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. సాధించుకున్న తెలంగాణలో నాటి ఉద్యమ దృశ్యాలు తనకు ఇప్పటికీ కళ్ళ ముందు సాక్షాత్కారమవుతున్నా యన్నారు. నాటి నుండి నేటి వరకు తెలంగాణ ఎలా అభివృద్ధి అయిందో తెలియజేసేందుకు ఈ 22 రోజుల తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించామన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండూ పోటీపడి రాష్ట్రంలో నడుస్తున్నాయని, కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలను అభివృద్ధి చేయడమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని అన్నారు. స్వార్థం కోసం కాకుండా ప్రాంతం అభివృద్ధి కోసం తెలంగాణను ఇంకా ముందుకు తీసుకు వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ఈ కృషికి ప్రతి ఒక్కరూ సహకార అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా ఇంకా అభివృద్ధి పథంలో ముందుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా పరిషత్తు వైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య, జిల్లా కలెక్టర్ జి. రవి నాయక్, అడిషనల్



కలెక్టర్ కే. సీతారామారావు, గొర్రె కాపరుల సంఘం అధ్యక్షులు శాంతయ్య యాదవ్, జిల్లా గ్రంధాలయ సంస్థ అధ్యక్షులు రాజేశ్వర్ గౌడ్, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ కేసి నర్సింహులు, ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్ తదితరులు ఉన్నారు.

బాలానగర్ : బాలానగర్ మండల లో మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఎంపీపీ కమల అధ్యక్షతన జరిగిన శతాబ్ది ఉత్సవాల ముగింపు క్షణంలోనే ముగిసింది. తెలంగాణ స్మారక దినోత్సవం సందర్భంగా అమరవీరుల త్యాగాల కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ .ఎంపీడీవో కృష్ణారావు .పశువైద్యాధికారి రఘురాం ఉన్నారు.

మిడ్జిల్ : అమరుల త్యాగ ఫలితమే కెసిఆర్ నిరాహార దీక్ష ద్వారానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఎంపీపీ సుదర్శన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎంపీడీవో సమావేశ మందిరంలో తెలంగాణ దశాబ్ది వేడుకల్లో బాగంగా తెలంగాణ అమరవీరుల దినోత్సవం సందర్భంగా అమరవీరుల ఆత్మ శాంతికోసం రెండు నిమిషాలు అధికారులు ప్రజాప్రతితో కలిసి మౌనం పాటించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బాదేపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్యామ్ సుందర్ రెడ్డి, చైర్మన్ శ్రీనువాస్ రెడ్డి, వైస్ ఎంపిపి తిరుపతమ్మ రవి గౌడ్, ఎంపీటీసీ వసంత రమేష్ నాయక్, మండల అధ్యక్షులుపాండుయాదవ్ ఎంపిడివో సాయిలక్ష్మి, ఏఓ సిద్దార్థ, డాక్టర్లు మనుప్రియ,కృష్ణకుమార్ ఎంపీఈఓ అనురాధ,వార్డు సభ్యులు గోపాల్ ముదిరాజ్ నాయకులు గోపాల్ రెడ్డి,చంద్రయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం



కొల్లాపూర్ రూరల్‌లో..

కల్వకుర్తి : ముఖ్యమంత్రి కేసీఆర్ 9 ఏళ్లకే దశాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాలకు వ్యతిరేకంగా పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద దగా ఉత్సవాల కార్యక్రమం జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతకుముందు పట్టణంలోని మహబూబ్ నగర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా తుంగలో తొక్కారని మండిపడ్డారు. కెసిఆర్ మాయమాటలు నమ్మి ఓట్లు వేసిన ప్రజలు ఈసారి ఆయనకు ఓట్లు వేయడానికి సిద్ధంగా లేరని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి. యువజన కాంగ్రెస్ తాలూకా అధ్యక్షులు అనిల్ గౌడ్, నాయకులు గోపాల్, రాహుల్, నాని యాదవ్ పాల్గొన్నారు.

కొల్లాపూర్ రూరల్ : కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో టీపీసీసీ అధ్యక్షులు శ్రీ రేవంత్ రెడ్డి గారి పిలుపు మేరకు,ఇంచార్జ్ డా.మొగుళ్ళ అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో కెసిఆర్ 10 తలలు దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ఆర్డీవోకి వినతి పత్రం సమర్పించారు. ఇంచార్జ్ డా.మొగుళ్ళ అశోక్ గౌడ్ , టీపీసీసీ రాష్ట్ర మహిళా కార్యదర్శి కాటమోని తిరుపతమ్మ కృష్ణయ్య గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం వచ్చి తొమ్మిదేళ్ల అయినా రాష్ట్రప్రభుత్వం మాత్రం ఈ నెల 2వ తేదీ నుండి 22 వ తేదీ వరకు ప్రజా ధనాన్ని దుర్వినియోగపరుస్తూ తన పార్టీ ప్రచారానికి దశాబ్ది ఉత్సవాలను జరుపుతుందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలలో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా యావత్ తెలంగాణ సమాజం జరిపిన పోరాటాలతోపాటు స్వరాష్ట్ర సాధన కోసం 1200 మందికి పైగా ఆత్మ బలిదానాలు చేసి ఒదన్నారు. తెలంగాణ సాధిస్తే గద్దెనెక్కిన కేసీఆర్ ప్రభుత్వం గత తొమ్మిదేళ్ల దాటినా ఆశయ సాధన దిశగా చేసిందేమీ లేదన్నారు. మిగులు బడ్జెట్లో లభించిన రాష్ట్రం నేడు ఐదు లక్షల కోట్ల రూపాయల మేరకు అప్పుల పాలయిందంటే ఈ అప్పుల పాపానికి పూర్తి బాధ్యత రాష్ట్రప్రభుత్వానిదే. ఈ కార్యక్రమంలో నేషనల్ ఓబీసీ కోఆర్డినేటర్ కేతూరి వెంకటేష్ గారు, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రంగినేనీ జగదీశ్వర్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు రాము యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాటమోని కృష్ణయ్య గౌడ్, అన్ని మండలాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

తెలంగాణ దశాబ్ది పేరుతో ప్రజాధనం వృథా : కాంగ్రెస్





మహబూబ్ నగర్ :తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధానాన్ని వృథా చేస్తున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కొత్వాల్ మాట్లాడుతూ ప్రజలను మరోసారి మోసం చేయడానికే దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. దశాబ్ది ఉత్సవాల్లో ప్రభుత్వసొమ్మును వాడుకుంటూ ప్రచారం చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడే కంటే మిగులు బడ్జెట్లో ఉన్న.. రాష్ట్రం ఉంటే ఈ ప్రభుత్వం అప్పుల రాష్ట్రంగా మార్చిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు వినోద్ కుమార్ , టిపీసీసీ ఉపాధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. నిరసనలో టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, నాయకులు సిరాజ్ ఖాద్రీ, సాయిబాబా, లింగంనాయక్, కంచిమి లక్ష్మణ్, రాఘవేంద్ర రాజు, అబ్దుల్ హక్, అజ్మత్ అలీ, అవేజ్, చంద్రశేఖర్, రాములు యాదవ్, రమేశ్, భీమ్ రెడ్డి, నాగరాజు. సల్మాన్, తాహెర్ , లోక్ నాథ్, వెంకటలక్ష్మి, శారద, తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల : తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ పోరాట ఫలితంగా ఏర్పడిన ప్రత్యేక రాష్ట్రంలో పదేళ్లపాటు ప్రజలను మోసం చేసినందుకు కెసిఆర్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తుందని జడ్చర్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జనంపల్లి అనిరుద్ రెడ్డి విమర్శించారు. గురువారం జడ్చర్ల పట్టణంలో దశాబ్ది ఉత్సవాల నిరసిస్తూ కాంగ్రెస్ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు ధర్నా రాస్తారోకో నిర్వహించి పది తలల ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

బాలానగర్ : మండల కేంద్రంలో నివసిస్తున్న పేద ప్రజలందరికీ, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, పెన్షన్, రేషన్ కార్డులు ఇవ్వాలని గురువారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దీప్లా నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్స వాలు పేద ప్రజల యొక్క సమస్యలపై మాట్లాడ కుండా ఉత్సవాల నిర్వహించడం దురదృష్టకరం. ఈనెల 26న ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్నామని తెలిపారు. అప్పటికి ప్రభుత్వం స్పందించకుంటే ప్రభుత్వ భూములను గుర్తించి, ఆ భూముల్లో పేద ప్రజలే గుడిసెలు వేసి భూమిని ఆక్రమించుకుంటామని, ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి పేద ప్రజలకు పై సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు భీమ్లా నాయక్, హమీద్, వీరేశం, మహేందర్, చందర్ నాయక్, వంశీ తదితరులు పాల్గొన్నారు..

జడ్చర్ల : ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఉన్న పేదలకు ఇంటి నిర్మాణం కోసం ఇవ్వనున్న డబుల్ బెడ్రూం నిర్మాణాల కు 5 లక్షల రూపాయలు ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఏ రాములు డిమాండ్ చేశారు. గురువారం జడ్చర్ల పట్టణంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటి సర్వేలో భాగంగా పట్టణంలోని పాత బజార్ కాలనీలో ప్రజలతో ఆయన మాట్లాడారు.డబుల్ బెడ్ రూమ్ ఇంటి స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి 5లక్షలు ఇవ్వలని ,రేషన్ కార్డులు పెన్షన్ తదితర సమస్యలు పరిష్కరించాలని అన్నారు. జూన్ 26న స్థానిక జడ్చర్ల తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రేషన్ కార్డులు పెన్షన్ కోసం చేసుకున్న దరఖాస్తులు పెండింగ్లో ఉన్నవి పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్యయ్య పాల్గొన్నారు.





చైనా బజారు ఎదుట అఖిల పక్ష ఐక్యవేదిక ధర్నా

నవతెలంగాణ వనపర్తి

వనపర్తి జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ లో నిర్మాణం చేపట్టిన చైనా బజారు షాపింగ్ మాల్ ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ చైనా బజార్ ఎదుట అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక అధ్యక్షులు సతీష్ యాదవ్ మాట్లాడుతూ పాత బస్టాండ్ ప్రాంతాన్ని ఆక్రమించి చైనా షాపింగ్ మాల్ను ఏర్పాటు చేశారని ఆయన అన్నారు. పాత బస్టాండు ఓపెన్ చేయాలని ఇంతకుముందు పలుమార్లు పోరాటాలు చేశామని, పేదల షాపులు తీశారు కానీ కార్పొరేటర్ సంస్థ అయిన చైనా బజార్ తో కుమ్మక్కై, అది తీయడం లేదని విమర్శించారు. వారితో పైసలు తిన్నవారు తిరిగి ఇవ్వవలసి వస్తుందని దాన్ని తీయడం లేదు అని , వెంటనే తీసివేయాలని, లేనిపక్షంలో త్వరలో వనపర్తి పట్టణం బంద్ ప్రకటిస్తామని హెచ్చరించారు. అక్కడున్న పూల షాప్ వారికి 10 బై 12 డబ్బాలు ఏర్పాటు చేసి, మున్సిపాలిటీ నుండి నామినల్ రెంటుకు వారికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాత బస్టాండ్ పునరుద్ధరణ పై జిల్లా మంత్రినరంజన్ రెడ్డి , కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్లు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకొని పాత బస్టాండ్ ను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సతీష్ యాదవ్ తో పాటు ఉపాధ్యక్షులు జానంపేట రాములు, సత్యం, నీరడి ఆనంద్, ఎం నగేష్, శటమోని అశోక్, కాజా, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు అంగన్వాడీల జీవుజాత రాక

వనపర్తి : అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన జీవుజాత శుక్రవారం వనపర్తి జిల్లాకు చేరుకోనుందని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కుట్ట ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలోని అంగన్వాడీల యూనియన్ జిల్లా జాతకు ఘన స్వాగతం పలుకుతామన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని మర్రికుంట ధర్నా చౌక్ దగ్గర నేడు సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు హెల్పర్స్ సెంటర్స్ నడపాలని, టీచర్స్ సభకు రావాలని యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు పుట్ట ఆంజనేయులు, జిల్లా అధ్యక్షులు శారద, ఉపాధ్యక్షులు బి.కవిత, జిల్లా కార్యదర్శి బి.నరాయనమ్మ లు పిలుపునిచ్చారు.

ఇండ్లు ,ఇళ్ల స్థలాలు డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలి



వనపర్తి : నిరుపేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, డబల్ బెడ్ రూమ్ లు, గతంలో పట్టాలు ఇచ్చిన వారికి స్థలాలు చూపాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు జ్యోతి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం వనపర్తి జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం గురువారం స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు జ్యోతి పాల్గొని ప్రసంగించారు. గత ప్రభుత్వాల హయాంలో నిరుపేదలకు ఇండ్ల పట్టాలిచ్చిన వారికి స్థలాలు చూపాలని ,పట్టాలు లేని నిరుపేదలకు ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 10 లక్షలు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మీ ద్వారా ఐదు లక్షలు ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఇంటింటి ప్రచారం చేసినట్లు తెలిపారు. ఇంటి నిర్మాణానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి 15 లక్షలు ఇవ్వాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక గా డిమాండ్ చేస్తున్నామన్నారు. వనపర్తి జిల్లాలో పట్టణం తోపాటు అన్ని మండలంలోని గ్రామాలలో ఇంటి స్థలం లేని వారికి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, పట్టాలు గతంలో ఇచ్చిన వారికి స్థలాలు చూపాలని ఆమెట డిమాండ్ చేశారు. ఈనెల 26న అమరచింతకు వస్తున్నటువంటి బస్సు జాతను జయప్రదం చేయాలని కోరారు. ఇల్లు లేని పేదలంతా వ్యక్తిగత ధరకాస్తులతో జూన్ 24 న శనివారం జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి కందికొండ గీత, జిల్లా కార్యదర్శి ఏ లక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి సాయిలీల, కవిత పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించాలి

వనపర్తి : వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలలకు అనుస్ అకాడమీ గౌతమ్ మోడల్ స్కూల్ చాణిక్య హై స్కూల్ పాఠశాల ప్రిన్సిపాల్స్ కు గురువారం జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్యను అందించాలని టియుడబ్ల్యూజేయు జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరావు, జిల్లా ఎడ్యుకేషన్ కన్వీనర్ కుమార్ లు ప్రొసీడింగ్స్ కాపీని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టు పిల్లలకు ఒకరికి ఫ్రీ మరొకరికి 50శాతం ఫీజు తీసుకోవాలని వారు కోరారు. జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్యను అందించేందుకు సహకరించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్. డీఈవో గోవిందరాజులు ,టి యు డబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు మధు గౌడ్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

డీవీ కృష్ణ గోడపత్రిక విడుదల

ఆత్మకూరు : అమరచింత పట్టణంలో గురువారం పట్టణ కేంద్రంలోని మార్క్స్ భవనంలో డివి కృష్ణ ప్రథమ వర్ధంతి సభ గోడ పత్రికలను సిపిఐఎంఎల్ ప్రజాపంతా పార్టీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాపంత మార్గ నిర్దేశకుడు డివి కృష్ణ ,అరుదైన విప్లవ ఉద్యమ నాయకుడని ఆయన తమ జీవితాంతం విప్లవోద్యమం కోసం అవిశ్రాంతగా కృషి చేశారని 1969లో లేబర్ డిపార్ట్మెంట్ లో పనిచేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి విప్లవ ఉద్యమంలోకి వచ్చిన ఆయన ఉమ్మడి నిజామాబాద్ కరీంనగర్ జిల్లాలో ఉద్యమ నిర్మాణానికి పూనుకున్నారని అన్నారు. ఈ నెల జూన్ 26వ తేదీన హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించబోయే కామ్రేడ్ డివి కృష్ణ గారి ప్రథమ వర్ధంతి సభకు పార్టీ కార్యకర్తలు, కార్మికులు, ప్రజలు ,అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు వనపర్తి జిల్లా అధ్యక్షులు పి అరుణ్ కుమార్, డివిజన్ నాయకులు సిరాజు, మండల కార్యదర్శి కే రాజన్న ,మండల నాయకులు ఏ సామ్యూల్, కురుమన్న ,పట్టణ నాయకులు జిలాని ,భక్తురాజు ,రామచందర్, ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశాన్ని అడ్డుకున్న కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు

- 4 ఏళ్ళు గడిచిన ప్రతిపక్ష పార్టీల వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టడం లేదంటూ నిరసన

నారాయణపేట : మున్సిపల్ కౌన్సిల్ చరిత్ర ఎప్పుడు జరుగని విధంగా ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయడానికి పోలీసులు రంగ ప్రవేశం చేశారు.పోలీసులు, కౌన్సిలర్లు వాదోపవాదాలు మధ్య గురువారం జరిగిన నారాయణపేట మున్సిపల్ సమావేశం రసాభాసగా రణరంగంగా మారింది.మున్సిపల్ చైర్ పర్సన్ గందే అనసూయ అధ్యక్షత న గురువారం నారాయణపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు.గడిచిన నాలుగేళ్ళ లో ప్రతిపక్ష పార్టీ వార్డుల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు ఎండి.సలీం,సత్య రఘుపల్ రెడ్డి,రఘు,రమేష్, అనూష,అంబికా లు చైర్మన్ తో వాగ్వివాదం చేశారు.ప్రతిపక్ష పార్టీల వార్డుల్లో అభివృద్ధి పనులు చేయాలని అప్పటివరకు సమావేశం నడిచేది లేదని,సమావేశాన్ని వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ రెండు గంటల పాటు నేల పై కూర్చొని సభను నడవనియకుండా అడ్డుకున్నారు.తమ వార్డుల్లో తనకు సమాచారం ఇవ్వకుండానే ఇంజనీర్ మహేష్ అభివృద్ధి పనులకై ప్రతిపాదనలు సిద్ధం చేయడాన్ని 7వ వార్డ్ కౌన్సిలర్ ఎండి. సలీం తీవ్రంగా ఆక్షేపించారు.వార్డులో సమస్యలు పరిష్కరించాలని చైర్మన్ ను పలుమార్లు కోరిన పట్టించుకోవడం లేదని,వార్డులో సీసీ రోడ్లు,డ్రైనేజీలు లేక అవస్థలు పడుతున్నా పట్టించుకోకుండా చైర్ పర్సన్ వార్డ్ ల పై వివక్ష చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.బీజేపీ కౌన్సిలర్ సత్య రఘుపల్ రెడ్డి, రాఘవేంద్ర లు మాట్లాడుతూ ఎప్పటి వరకు ఏ ఏ వార్డుకు ఎన్ని అభివృద్ధి నిధులు కేటాయించారో తెలపాలని డిమాండ్ చేశారు.బీజేపీ కౌన్సిలర్లు ఉన్న వార్డుల్లో నేటికి మిషన్ భగీరథ పైప్ లైన్ వేయలేదని,ప్రజలు అవస్థలు పడుతున్న పట్టించుకోవడం లేదన్నారు.సమావేశపు ఏజండా కౌన్సిలర్లు కు తెలియకుండానే తయారు చేస్తున్నారని కేవలం అధికార పార్టీ వార్డుల్లోనే అభివృద్ధి పనులు చేస్తున్నారు తప్ప తమ వార్డుల్లో ఒక్క పని చేయడం లేదన్నారు.కేవలం బిల్లుల కోసం మాత్రమే సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు తప్ప ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు.అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు వాగ్వివాదానికి దిగడంతో సమావేశం రణరంగంగా మారింది.అభివృద్ధి పనులు చేపట్టే వరకు ఎట్టి పరిస్థితుల్లో సమావేశం జరిగేది లేదని ప్రతిపక్ష కౌన్సిలర్లు భీష్మించుకొని కూర్చోవడంతో తలొగ్గిన చైర్మన్ గందే అనసూయ నేటి సమావేశంలో పెట్టిన అభివృద్ధి పనుల ప్రతిపాదనలను రద్దు చేసి వచ్చే నెలలో ప్రత్యేక సమావేశం నిర్వహించి వార్డుల వారిగా అభివృద్ధి పనుల ప్రతిపాదనలు పెడతామని దయచేసి అందరూ కౌన్సిలర్లు మీ వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల ప్రతిపాదనలు ఇవ్వాలని కోరారు. దీనితో ప్రతిపక్ష కౌన్సిలర్లు శాంతించారు. రెండు ప్రతిపాదనలు మినహా మిగత నలభై ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు.కౌన్సిలర్లు అమీరుద్దీన్, తకీ చాంద్, మహేష్,బండి రాజేశ్వరి, శిరీష,అనిత,కొండ శ్వేతా,విశాలాక్షి,అనిత,ఇతర అధికారులు పాల్గొన్నారు.అభివృద్ధి పనులు చేపట్టే వరకు సమావేశం జరిగేది లేదని చైర్మన్ మరియు అధికార,ప్రతిపక్ష, పార్టీ కౌన్సిలర్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు కౌన్సిల్ సమావేశానికి చేరుకున్నారు.దీనితో ప్రతిపక్ష కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరితే పోలీసులను పిలిపించి అరెస్టు చేయిస్తారా ? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై జైలుకు వెళ్ళడానికి కూడా సిద్ధమని,వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ప్రతిపక్ష కౌన్సిలర్లు సలీం, సత్యరఘుపల్ రెడ్డి,రాఘవేంద్ర, లు అన్నారు.ఎస్సై సురేష్ కౌన్సిలర్లు ను సముదాయించి అక్కడి నుండి వెళ్లిపోవడంతో సమావేశం సద్దుమణిగింది.

అమరుల త్యాగాలు వెలకట్టలేనివి : మంత్రి

- అమరవీరుల త్యాగం మరువలేనిది
- ఎమ్మెల్యే లు, నాయకులు హాజరు
- ఘనంగా అమరవీరులకు నివాళులు



వనపర్తిలో..

నవతెలంగాణ- వనపర్తి

అమరులకు మించిన త్యాగం మరొకటి ఈ సృష్టిలో లేదని, అమరులను స్మరించుకోవడం అంటే వారి ఆకాంక్షలను నెరవేర్చడం అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన గురువారం అమరుల సంస్మరణ వేడుకలను వనపర్తి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. జడ్పి చైర్మన్ ఆర్. లోక్ నాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ రక్షిత కృష్ణ మూర్తి తో కలిసి అమర వీరుల స్థూపానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఉదయం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ఆవరణలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపానికి మంత్రి వర్యులు, జడ్పి చైర్మన్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ వరుసగా పూల మాలా వేసి నివాళులు అర్పించిన అనంతరం 2 నిముషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అమరులను స్మరించుకోవడం అంటే కేవలం పూలు చల్లడం కాదని, సమాజంలోని ప్రజలంతా ఉన్నతంగా నిలవాలి అన్నది వారి ఆలోచన ఆకాంక్ష అని తెలిపారు. తెలంగాణ అమర వీరులు ఏ ఆకాంక్షతో అయితే వారు తమ ప్రాణ త్యాగం చేసి అమరులయ్యారో అట్టి ఆకాంక్షలను నేరవెర్చెందుకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో నెరవేర్చుతూ వస్తుందన్నారు. అందుకే నేడు తెలంగాణ దేశంలో చాలా విషయాల్లో అగ్రగామిగా నిలుస్తుందని తెలియజేశారు. అనంతరం వనపర్తి జిల్లా నుండి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరులైన వారి కుటుంబ సభ్యులను పూల మాల, శాలువాతో సత్కరించి వారితో సహపంక్తి భోజనం చేశారు. దాసరి నరేష్ తల్లి గారైన దాసరి చెన్నమ్మ, కొత్తకోట నుండి కావలి సువర్ణ తల్లి కావలి రాములమ్మ, వీరాసాగర్ వారి అక్క పద్మ, సత్యమ్మ కుమారులైన నాగరాజు, అంజనేయులు లను సన్మానం చేశారు. ఈ కార్యక్రమం లో జడ్పీ చైర్మన్ ఆర్. లోక్నాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ రక్షిత కృష్ణమూర్తి, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, అడిషనల్ ఎస్పీ షాకిర్ హుస్సేన్, డి.ఎస్పీ ఆనంద్ రెడ్డి, ఆర్డీవో పద్మావతి, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వనపర్తి : తెలంగాణ అమర వీరులు తమ కోసం తమ కుటుంబం కోసం కాకుండా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలి అనే మహా సంకల్పంతో తమ ప్రాణాలను త్యాగం చేశారని జిల్లా పరిషత్ చైర్మన్ ఆర్. లోక్ నాథ్ రెడ్డి అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం వనపర్తి జిల్లాలో అమరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి అమరులకు నివాళులు, శ్రద్ధాంజలి ఘటించడంతోపాటు అమరుల సంస్మరణ తీర్మానం చేశారు. ఈ ప్రత్యేక సమావేశం లో జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ అమరవీరులు తమ కొరకు కాకుండా తెలంగాణ ప్రజల



కొరకు తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు. ఈ జిల్లా నుండి సైతం కొంతమంది యువకులు తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు. వైస్ చైర్మన్ వామన్ గౌడ్ మాట్లాడుతూ జూన్ 2వ తేదీన ప్రారంభమైన తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలు 21 రోజులపాటు వనపర్తి జిల్లాలో ఘనంగా నిర్వహించుకుని విజయవంతంగా ముగిశాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పి సిఈ. ఒ. శ్రావణ కుమార్, వైస్ చైర్మన్ వామన్ గౌడ్, జడ్పి టిసిలు, కో ఆప్షన్ సభ్యులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : రాష్ట్ర ప్రభుత్వ నిర్వహిస్తున్న రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం అమరుల సంస్కరణ దినోత్సవ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణంలోనే మున్సిపల్ కార్యాలయం నందు అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గాయత్రి రవికుమార్, వైస్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, కమిషనర్ నాగరాజు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, ఎంపీపీ బంగారు శ్రీనివాసులు ,వైస్ ఎంపీపీ కోటేశ్వర్, పిఎసిఎస్ అధ్యక్షులు గాడి లక్ష్మీనారాయణ, లక్ష్మీకాంత్ రెడ్డి ,మాజీ ఎంపీపీ శ్రీధర్ గౌడ్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు,ఎమ్మార్వో సింధుజ, ఎంఈఓ భాస్కర్ సింగ్ అధికారులు పాల్గొన్నారు.

కొత్తకోట: అమరవీరుల త్యాగాలు మరువలేనివని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం అన్నసాగర్ లో కొత్తకోట మండలానికి చెందిన అమరవీరుల కుటుంబాలకు ఆత్మీయ సన్మానం కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దశాబ్ది ఉత్సవాలలో బాగంగా అమరులైన వారిని స్మరించుకుంటు తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమం లో అమరులైన కుటుంబాలను దేవరకద్ర ఎమ్మెల్యే శాలువా పులమాలలతో ఘనంగా సన్మానించారు. కొత్తకోట మండలం మిరసిపల్లె గ్రామానికి చెందిన కావాలి సువర్ణ అమ్మ రాములమ్మ, కొత్తకోట కు చెందిన దాసరి నరేష్ అమ్మ చేన్నమ్మ ను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరుల త్యాగాలు వెలకట్టలేనివని, ప్రత్యేక రాష్ట్ర సాధనలో అమరులైన వారిని ఈ రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు గుర్తుంచుకుంటుందని వారి కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి



ఆత్మకూరులో..

తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, ముసాపేట్ జడ్పీటీసీ ఇంద్రయ్య సాగర్ , మాజీ జడ్పీటీసీ విశ్వేశ్వర్,జిల్లా అధికార ప్రతినిధి గాడిల ప్రశాంత్, శ్రీనుజి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం దగ్గర ఎంపీపీ కమలేశ్వరరావు మండల స్థాయి అధికారులు గ్రామస్తులు అమరవీరుల స్తూపం దగ్గర పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కథలప్ప తహసీల్దార్ పాండు నాయక్ వీపనగండ్ల ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి గోవర్ధనగిరి ఎంపీటీసీ ఈశ్వరమ్మ తూముకుంట ఎంపీటీసీ రాము వీపనగండ్ల సర్పంచ్ నరసింహారెడ్డి, ఏపీఎం, రాజశేఖర్ రెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ, మండ ఐసిడిఎస్ సూపర్వైజర్ నారాయణమ్మ గ్రామస్తులు ఎత్తం, బాలస్వామి, రవీందర్ రెడ్డి రజాక్ గోపి తదితరులు పాల్గొన్నారు

వీపనగండ్ల : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం రోజు మండల స్థాయి అధికారులకు ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక సమావేశాన్ని ఎంపీపీ కమలేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల భాగంగా అమరవీరులకు నివాళులర్పిస్తూ అధికారులు ప్రజా ప్రతినిధులు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కమలేశ్వరరావు మాట్లాడుతూ అమరవీరుల స్ఫూర్తితో మండల అభివృద్ధి కోసం వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మండల అభివృద్ధి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో ఎంపీడీవో కథలప్ప తాసిల్దార్ పాండు నాయక్ ఏపీవో శేఖర్ గౌడ్ జిల్లా ఎంపీటీసీల ఫోరం సంఘం అధ్యక్షులు ఇంద్రకంటి వెంకటేష్ ఎంపిటిసిలు భాస్కర్ రెడ్డి రాము ఈశ్వరమ్మ సర్పంచ్ లు నరసింహారెడ్డి, నారాయణ నాయక్ ఏపీఎం రాజశేఖర్ రెడ్డి , మండల ఐ సి డి ఎస్ సూపర్వైజర్ నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : రాష్ట్ర ప్రభుత్వ నిర్వహిస్తున్న రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం అమరుల సంస్కరణ దినోత్సవ ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో పట్టణంలోనే మున్సిపల్ కార్యాలయం నందు అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గాయత్రి రవికుమార్, వైస్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, కమిషనర్ నాగరాజు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయం నందు జరిగిన సమావేశంలో అమరవీరులను స్మరించుకున్నారు. ఇట్టి కార్యక్రమంలో ఎంపీపీ బంగారు శ్రీనివాసులు ,వైస్ ఎంపీపీ కోటేశ్వర్, గా పిఎసిఎస్ అధ్యక్షులు గాడి లక్ష్మీనారాయణ, లక్ష్మీకాంత్ రెడ్డి ,మాజీ ఎంపీపీ శ్రీధర్ గౌడ్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎమ్మార్వో సింధుజ, ఎంఈఓ భాస్కర్ సింగ్ మరియు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.







విపనగండ్లలో..

ప్రజా సమస్యలపై ఇంటింటి సర్వే



వీపనగండ్లలో..



ఆత్మకూరులో..

ఆత్మకూరు : అమరచింత పట్టణంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో దుబాయ్ కుంటలో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలు ఇవ్వాలని ,పొజిషన్ చూపించాలని ,గృహలక్ష్మి పథకం కింద ఇల్లు నిర్మించుకునేందుకు ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలన్నారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని దళిత బంధు పథకం కింద మండలంలోని అన్ని గ్రామాలకు ఇవ్వాలని ,బీసీ ఉపకులాలకు లక్ష రూపాయల రుణాన్ని లోన్లను ఈనెల ఆఖరు వరకు పొడిగించాలని పలు సమస్యల కొరకు నేడు అమరచింత పట్టణంలోని మండల తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.అజయ్, ఏఐటియు జిల్లా నాయకులు ,ఏ.బుచన్న,ఏ రవికుమార్,ఎస్. రమేష్, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల : మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఐక్య పోరాట సంఘం ఆధ్వర్యంలో బుధవారం సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని చేపట్టారు గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 23వ తేదీన తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని ధర్నా కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను దరఖాస్తుల రూపంలో ఇవ్వాలని కోరారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, ఈశ్వర్ సిఐటియు నాయకులు రామన్ గౌడ్ బత్తుల రాముడు ఎస్ఎఫ్ నాయకులు నవీన్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలలో ప్రవేశాలు

- అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్

నవతెలంగాణ -వనపర్తి

ప్రభుత్వ పాఠశాలలో చదివిన నిరుపేద విద్యార్థులకు బీసీ. సంక్షేమ శాఖ ద్వారా కార్పోరేట్ కళాశాలలో ప్రవేశము కల్పించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అన్నారు. గురువారం మధ్యాహ్నం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం జే.సి. ఛాంబర్ లో అదనపు కలెక్టర్ కార్పొరేట్ కళాశాలకు ఎంపికైన 7 మంది విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకానికి ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో గానీ, ప్రభుత్వ వసతి గృహాల్లో లేదా ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉండి, పదవ తరగతిలో 400 కు పైబడి మార్కులు వచ్చిన బిసి విద్యార్థులు ఆర్థికంగా వెనుకబడిన తరగతుల విద్యార్థులు అర్హులని తెలిపారు. రూ. 3000/- మొత్తాన్ని జేబు ఖర్చుల నిమిత్తం విద్యార్థి ఖాతాకు విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బి.సి. సంక్షేమ శాఖ జిల్లా అధికారి యం. అనిల్ ప్రకాష్, జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి (కన్వీనర్) నుషితా తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి మృతి..

వెల్దండ : వెల్దండ మండల కేంద్రానికి చెందిన దత్తం రమేష్ (32)తన ఇంట్లో నీ చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాదులో ఉంటూ ఈ మధ్యనే వెల్దండ మండల కేంద్రానికి వచ్చి సెంట్రింగ్ పని చేస్తూ జీవనం గడిపే రమేష్ రోజు మాదిరిగానే ఈరోజు సైతం సెంట్రింగ్ పనికి వెళ్లి తిరిగి మళ్లీ ఇంటికి వచ్చి ఇంట్లోని చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారాన్ని చేశారు. రమేష్ కు పెళ్లయి భార్యతో విడాకులు తీసుకున్నట్లు సమాచారం. మృతి గల కారణాలు తెలియారాలేదు..

వైన్లో కూల్ బీర్లు లేవని ఆందోళన

- ఉప్పునుంతల మండల కేంద్రంలో .. మద్యం ప్రియులు
- పర్మిట్ రూం లేకుండా పట్టించుకోని అధికారులు

ఉప్పునుంతల: ఉప్పునుంతల మండల కేంద్రంలో ఉన్న కనకదుర్గ వైన్స్ మద్యం ప్రియులకు విరుద్ధంగా, నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. అధిక మొత్తంలో బెల్ట్ షాపులకు మద్యాన్ని సరఫరా చేస్తూ వైన్ షాపులో బీర్లను కూల్ గా ఉంచకుండా అడిగినవారికి ఇవ్వకుండా నిర్లక్ష్యపు సమాధానాలు ఇవ్వటమే కాక దౌర్జన్యానికి పాల్పడుతూ మద్యం ప్రియులకు చుక్కలు చూపిస్తున్నారు. వైన్స్ యజమానులు. దీంతో ఒక్కసారిగా కోపోద్రికులైన మద్యం ప్రియులు గ్రామస్తులు వెంటనే కూల్ బీర్లు అమ్మని వైన్ షాప్ మాకొద్దంటూ ముాయించేశారు. దీంతో వైన్స్ యజమానులు మద్యం ప్రియులతో వాగ్వాదానికి దిగారు. వెంటనే ఎక్సైజ్ ఎస్సై బాలవర్ధన్ రెడ్డికి సీఐ జనార్ధన్లకు యువకులు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు. టెండర్ గడువు ముగుస్తున్న ఇప్పటివరకు పర్మిట్ రూమ్ను ఏర్పాటు చేయకుండా కాలయాపన చేస్తూ మద్యం ప్రియులను ఇబ్బందులకు గురిచేస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని గ్రామ యువకులు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. గ్రామాల్లో నీ బెల్టు షాపులకు సరఫరా అయ్యే మద్యంపై ఉన్న శ్రద్ధ స్థానికంగా ఉండే ప్రజలపై లేదని వారు వెల్లడించారు గతంలో కూడా ఇలాంటి చర్య కొనసాగడంతో కొద్దిరోజులు మామ అనిపించారు మళ్లీ అదే తంతు కొనసాగిస్తూ అడ్డు అదుపు లేకుండా వ్యవహరిస్తున్నారు ఇలాంటి వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుని వెంటనే వైన్స్ టెండర్ లైసెన్స్ రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

మండల పరిషత్ ఆఫీసులో మరుగుదొడ్లకు తాళాలు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు.

నవ తెలంగాణ- అచ్చంపేట

మండల పరిషత్ కార్యాలయం లో పురుషులకు , మహిళలకు వేరువేరుగా మరుగుదొడ్ల మూత్రశాలలు నిర్మాణం చేశారు. మండలంలో 38 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 80 కిలోమీటర్ల వరకు గ్రామాలు విస్తరించి ఉన్నాయి ప్రతిరోజు వందల సంఖ్యలో ప్రజలు, మహిళా సర్పంచులు, ఎంపీటీసీలు వివిధ పనుల కోసం మండల పరిషత్ కార్యాలయానికి రావడం జరుగుతుంది. వారంలో నాలుగు ఐదు సార్లు అంగన్వాడీ టీచర్లతో, సమావేశాలు నిర్వహించడం జరుగుతుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై అధికారులు సమీక్షించుకుంటారు. మూత్రశాలలకు మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉండడంతో పనుల కోసం వచ్చిన ప్రజలు ఒకటికి , రెండు





కి అవస్థలు పడుతున్నారు. అధికారులు సిబ్బంది చాంబర్ లోపల ఉన్న మూతశాల మరుగు దొడ్లను వినియోగించు కుంటున్నారు. పనులపై వచ్చిన ప్రజలు మాత్రం అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి మూత్రశాల సౌకర్యం కల్పించాలని వివిధ గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కల్గి ఉండాలి



నవతెలంగాణ - వంగూరు

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కల్గి ఉండాలని తాసిల్దార్ రాజునాయక్ పేర్కొన్నారు. మండలంలోని గురువారం అమరుల స్తూపానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లా డుతూ.. 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు తప్పకుండా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బీమమ్మ, ఎంపీడీవో విజయభాస్కర్, డీటీ వెంకటరమణ, పంచాయతీరాజ్ ఏఈ మణిపాల్‌నాయక్, లాలుయాదవ్, పర్వతాలు, శ్రీను, ఎంపీడీవో ఎమ్మార్వో సిబ్బంది తదితరులు ఉన్నారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోండి..

నవతెలంగాణ- వెల్దండ



ఈ నెల 16 వరకు నూతన పట్టాదారు పాసుపుస్తకం పొందిన ప్రతి రైతు ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు సహాయకోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి మంజుల పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మండలంలో నూతనంగా భూమార్పిడి చేసుకుని పట్టాదారు పాసుపుస్తకం పొందిన 367 మంది లబ్ధిదారులు వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించి ఆయా గ్రామాల్లో రైతుబంధు సహాయంకోసం సంబంధిత పత్రాలు అందజేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండలంలోని 18284మంది రైతుబంధుకోసం అర్హులైన రైతులు ఉన్నారని ఏవో తెలిపారు.

ఒట్టెం నవోదయకు ఎంపికైన కూన రోహన్

నవ తెలంగాణ- వెల్దండ

ఇటీవల వెలువడిన నవోదయ పరీక్ష ఫలితాలలో మండల కేంద్రానికి చెందిన కూన రోహన్ ఉత్తమ ప్రతిభ కనబ రిచి ఒట్టెం నవోదయ పాఠశాలకు ఎంపికైయ్యారు. మండల పరిధిలోని రాచూరు పాఠశాలలో జీహెచ్‌ఎంగా పనిచేస్తున్న శ్రీనివాసులు కుమారుడు రోహన్ నవోదయ పాఠశాలకు ఎంపిక కావడంపై మండలవాసులు, విద్యార్థులు వారిని అభినందించారు.

విద్యుదాఘాతంతో గొర్రె మృత్యువాత

నవ తెలంగాణ -వెల్దండ

మండల పరిధిలోని చౌదర్పల్లి గ్రామానికి చెందిన కావటి వీరయ్య కు చెందిన గొర్రె విద్యుదాఘాతంతో మృతి చెందింది. గురువారం మేత కోసం వీరయ్య తన గొర్రెలను వ్యవసాయ పొలానికి తీసుకెళ్తుండగా గ్రామంలో ఏర్పాటుచేసిన సింగిల్ ఫేస్ బుడ్డీ వద్ద ఎర్త్‌వైర్ వద్ద ప్రమాదవశాత్తు ఇది షాక్‌కు గురై దాదాపు రూ. 12 వేల విలువచేసే గొర్రె అక్కడికక్కడే మృతి చెందింది. చనిపోయిన గొర్రెకు ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లిలో గురువారం దశాబ్దితెలంగాణ ఉత్సవాల సందర్భంగా డీసీసీబీ డైరెక్టర్ సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్‌రావు, మండల ఎంపీడీవో లక్ష్మణరావు లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్రావు, ఆలయ కమిటీ చైర్మన్ రామస్వామిగౌడ్, స్థానిక సర్పంచ్ కల్పన పరమేష్, దాసర్లపెల్లి సర్పంచ్‌స్వర్ణలత, రామచంద్ర పాల్గొన్నారు.

"అనాథల అరిగోస దీక్ష"లను జయప్రదం చేయండి

నవతెలంగాణ -కందనూలు

ఈ నెల 23న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో నిర్వహించబోయే అనాథల అరిగోస దీక్షలను జయప్రదం చేయాలని జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ మాదిగ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజానీకానికి ఇచ్చిన హామీలను అమలు పరచకుండా కేసీఆర్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. అనాథ పిల్లలకు గత ఎనిమిది సంవత్సరాల క్రితం స్మార్ట్‌కార్డులు ఇస్తామని కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య అందించేందుకు రెసిడెన్షియల్ విద్యాసంస్థల నెలకొల్పుతామని ఇచ్చినహామీలను అమలు చేయకుండా మోసం చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనాథల హక్కుల కోసం నియమించబడ్డ మంత్రివర్గ సిఫార్సులను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

కొనసాగుతున్న గుడిసెల పోరాటం



నవతెలంగాణ- వంగూరు

మండలంలోని డిండి చింతపల్లి గ్రామంలో ఇండ్ల స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ మూడవ రోజు చింతపల్లి ప్రజలు ఇంటి స్థలాల వద్ద సమావేశమైయ్యారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింత ఆంజనేయులు, మండల కార్యదర్శి బాలస్వామి మాట్లాడుతూ.. పేదలకు వెంటనే ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 1997లో ఇళ్ల స్థలాల కోసం 11 ఎకరాల భూమిని ఆనాటి ప్రభుత్వం కొనుగోలు చేసి నేటి వరకు పంచకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. ప్రభుతవఅం తమ అవసరాలకోసం ఇంటి స్థలాలకు కేటాయిం చిన స్థలాలలో ప్రభుత్వ అవసరాలకోసం ఫంక్షన్ హాల్లో రైతు వేదిక నిర్మించారని పేదల జాగాలో పేదలకే చెందాలన్నారు. వెంటనే పేదలకు కేటాయించిన ఇంటి స్థలాలలో పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సైదులు, శ్యామలయ్య, నారమ్మ, వెంకటమ్మ, ఎల్లమ్మ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

బిజినేపల్లి: మండలంలో మమ్మాయిపల్లి గ్రామ శివారులో గుర్తుతెలియని మహిళా మృతదేహం గుర్తించినట్లు స్థానికులు తెలిపారు. ఈ శవం మమ్మాయిపల్లి నుంచి వనపర్తి వెళ్లే దారిలో బీటీ రోడ్డు పక్కన ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. ఈమె వయస్సు దాదాపుగా 40 నుంచి 45 వరకు సంవత్సరాలు మధ్యలో ఉంటుందని ఈ మృతదేహాన్ని నాగర్ కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో మార్చురీలో ఉందని ఎస్సై కృష్ణ ఓబుల్ రెడ్డి తెలిపారు. ఈమెను ఎవరైనా గుర్తించినట్లయితే స్థానిక పోలీస్ స్టేషన్ 8712657714 నెంబర్‌కు తెలియజేయాలని ఎస్సై తెలిపారు.

ఎస్సై రాజు యాదవ్‌కి సన్మానం

పెద్దకొత్తపల్లి : నూతన ఎస్సై గా పదవీ బాధ్యతలు స్వీకరించిన రాజు యాదవ్‌ని గురువారం యాపట్ల గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ అజయ్‌కుమార్ మరియు బీఆర్ఎస్, మైనార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎస్సై రాజు యాదవ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. యాపట్ల గ్రామ ఉపసర్పంచ్ అజయ్,గ్రామ బీఆర్ ఎస్ మైనార్టీ నాయకుడు, కో-ఆప్షన్ మెంబర్ ఎండీ జహంగీర్, యువకులు సాదిక్, మునిర్, నిజాం, పరహన్ పాషా తదితరులు ఉన్నారు.

కారణజన్ముడు కేసీఆర్

నవ తెలంగాణ- కోడేరు

మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పుట్టిన కారణజన్ముడు అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దు రెడ్డి రఘువర్ధన్ రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసమే పుట్టారని ఆయన కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఎందరో అమర వీరులు ప్రాణ త్యాగాలు చేశారని వారి ఆత్మకు శాంతి కలగాలని కేసీఆర్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించతల పెట్టడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం వారు అమరవీరుల స్తూపం దగ్గర పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటస్వామి, విండో డైరెక్టర్ జగన్ మోహన్‌రెడ్డి, రైతుసమన్వయసమితి అధ్యక్షుడు జగదీశ్వర్‌రావు, గ్రామ అధ్యక్షుడు శ్రీశైలం, ఎంపీడీవో శ్రవణ్‌కుమార్, హైస్కూల్ హెచ్‌ఎం కృష్ణయ్య, హైస్కూల్ చైర్మన్ శేఖర్, యాప చెట్టు లాలు, వార్డ్ మెంబర్ బాలపీరు పాల్గొన్నారు.



ప్రజాసేవకు పునరాంకితమవుదాం

- ప్రభుత్వ విప్ డాక్టర్ గువ్వల బాలరాజ్

నవతెలంగాణ -కందనూలు



అమరుల త్యాగాలను వృథా కానీ ఇవ్వమని, అమరవీరుల ఆత్మలు శాంతించే విధంగా తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేలా ప్రజాసేవకు పునరాంకితవుతామని ప్రభుత్వ విప్ డాక్టర్ గువ్వల బాలరాజు అన్నారు. గురువారం జిల్లా పోలీస్ పెరేడ్‌గ్రౌండ్లో జెడ్పీచైర్పర్సన్ శాంతకుమారి, కలెక్టర్ పి ఉదయ్ కుమార్, ఎస్పీ కే మనోహర్‌లతో కలిసి అమరవీరుల స్తూపం వద్ద అమరులకు నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం అవతరించి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకుని పదోవసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా జిల్లావ్యాప్తంగా 21రోజులపాటు దశాబ్దిఉత్సవాలను కనీవిని ఎరుగని రీతిలో ఘనంగా నిర్వహించిందన్నారు. ఈ ఉత్సవాలు మూడు వారాలుగా వైభవంగా, పండుగ వాతావరణంలో కొనసాగాయన్నారు. రోజుకు ఒక రంగం చొప్పున ఆయా రంగాల వారీగా దినోత్సవాలను నిర్వహిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల తీరుతెన్నులను ప్రజలకు జిల్లా అధికారులు వివరిస్తూ ఘనంగా నిర్వహించారన్నారు. తొమ్మిదేళ్ల హయాంలో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన విజయాలు, ప్రజలకు చేకూర్చిన లబ్ధి వివరిస్తూ కార్యక్రమాలు జరిగాయన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ కోసం ఆత్మ బలిదానాలు చేసిన అమర వీరులకు బాధ తప్త హృదయంతో అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నానన్నారు. తెలంగాణ ఉద్యమ నేత సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదోవసంతంలోకి అడుగుపెడుతున్న వేళ, తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలను త్యజించిన అమరుల యాదిలో జరిగిన అభివృద్ధి వెలుగులు నేడు రాష్ట్రమంతటా కనిపిస్తున్నాయన్నారు. దేశ చరిత్రలోనే ఘనకీర్తి కలిగిన తెలంగాణ మట్టిబిడ్డల మనోవేదనకు ముగింపు పడి, త్యాగాల తెలంగాణ బానిస సంకెళ్లను తెంచుకొని స్వరాష్ట్రంలో తలెత్తుకొని సగర్వంగా నిలబడి దశాబ్ది ఉత్సవాలను జరుపుకుంటున్నామన్నారు. అనంతరం ఎస్‌జేఆర్‌ఫంక్షన్‌హాల్‌లో జెడ్పీచైర్పర్సన్ శాంతకుమారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ సమావేశాన్ని నిర్వహించి తెలంగాణ రాష్ట్ర అవతరణ కోసం ఎంతోమంది యువతి, యువకులు విద్యార్థులు పౌరుల ఆత్మ బలిదానాలు చేసిన అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించి అమరుల సంస్కరణ తీర్మానాలను జెడ్పీ చైర్పర్సన్ శాంతకుమారి ప్రవేశపెట్టి తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన సమానత్వ విలువకోసం జరి గిన మహత్తర పోరాటం తెలంగాణరాష్ట్ర సాధన ఉద్యమమని ఆమె అన్నారు. చైర్పర్సన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ్యులందరూ ఏకగ్రీవ తీర్మానంగా ఆమో దించాలని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు తీర్మానాన్ని బలపరిచారు. సభ్యులం తా హర్షాతిరేకాల మధ్య ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించారు. అనంతరం జిల్లాలో తెలంగాణ రాష్ట్ర సాధనకోసం ఆత్మ బలిదానాలు చేసిన వంకేశ్వర గ్రామా నికి చెందిన అమరుడు నాగరాజ్ తల్లి ఈశ్వరమ్మను, ఉప్పునుంతలకు చెందిన అమరుడు బాలస్వామి భార్య అలివేలును కల్వకుర్తికి చెందిన అమరుడు కే కృష్ణయ్య కుమారుడు కే రామును శాలువాతో సత్కరించారు. అంతకుముందు కలెక్టర్ పి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం జరిగిందని, అందుకు సహకరించి పాలుపంచుకున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు, సహకరించిన పాత్రికేయులను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా చివరిరోజూ తెలంగాణ అమరవీరులకు కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రెండు నిమిషాలు మౌనం పాటించి అమరవీరులకు నివాళులు అర్పించారు. అదేవిధంగా నూతన ఇంటిగ్రేటెడ్ జిల్లా అధికారుల కాంప్లెక్స్ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎస్ మోతిలాల్, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసులు, అన్ని కార్యాలయాల అధికారులు తెలంగాణ అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మోతిలాల్ మాట్లాడుతూ.. అమరులను స్మరించుకోవడమే కాకుండా వారిని స్ఫూర్తిగా తీసుకొని ఉద్యోగులంతా అంకితభావంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కే మనోహర్, అదనపు కలెక్టర్ మనుచౌదరి, జెడ్పీపరిషత్ సీఈవో భాగ్యలక్ష్మి, వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, జెడ్పీటీసీ శ్రీశైలం, పదరా జెడ్పీటీసీ రాంబాబు, బల్మూర్ జెడ్పీటీసీ లక్ష్మమ్మ, జెడ్పీటీసీ చిట్టెమ్మ, జెడ్పీటీసీ కేతావత్ నేజమ్మ వివిధ శాఖల అధికారులు, మున్సిపల్‌చైర్మన్ కల్పనాభాస్కర్‌గౌడ్, వైస్‌చైర్మన్ బాబురావు పాల్గొన్నారు.

వెల్దండ: తెలంగాణ స్వరాష్ట్ర సాధనలో అమరులైన అమరవీరుల త్యాగం వెలకట్టలేనిదని ఎంపీపీ విజయ, సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామ పంచాయతీలలో అమరవీరుల స్మరణదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీర స్తూపాలవద్ద చిత్రపటాలు ఏర్పాటుచేసి వారికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నేడు రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ అభివృద్ధి ప్రజలకు అందుతున్న ఫలాలు అమరవీరుల ఆత్మబలిదానాల ఫలితంగా మనకు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, వైస్ ఎంపీపీశాంతి, ఉపసర్పంచ్ నిరంజన్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

తెలకపల్లి: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు పల్లెపల్లెలో అమరవీరుల సంస్కరణ దినోత్సవాన్ని నిర్వహించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంకోసం అమరులైన తెలంగాణ అమరవీరుల చిత్రపటాలకు పుష్పగుచ్ఛాలు ఉంచి రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంకోసం అమరవీరుల త్యాగాలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, ఎంపీవో వెంకట్, ఏపీఎం నిరంజన్, సీసీలు నిరంజన్, రాములు వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కల్వకుర్తి: తెలంగాణ దశాబ్దిఉత్సవాలలో భాగంగా కల్వకుర్తి పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం ఎదుట అమరవీరుల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై అమరవీ రుల స్థూపం వద్ద పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరవీరుల ఆశయ సాధన కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యం, వైస్ చైర్మన్ షాహిద్, మార్కెట్ చైర్మన్ విజయ్ గౌడ్, మాజీ చైర్మన్ శ్రీశైలం, కౌన్సిలర్ భోజిరెడ్డి, బావండ్ల మధు, ప్రజా ప్రతినిధులు అధికార పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: సూర్యచంద్రులు ఉన్నంతకాలం తెలంగాణ అమరవీరులను స్మరిస్తూనే ఉంటామని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణ కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ప్రక్కన అమరవీరుల స్థూపానికి పూలతో ఘనంగా నివాళులలర్పించి, అమరుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి చేసిన త్యాగం ప్రజల గుండెల్లో పదిలంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు ప్రజా ప్రతినిధులు, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో గురువారం తాసిల్దార్ శ్రీనివాసులుతో సహా కార్యాలయ సిబ్బంది తెలంగాణ అమరవీరులకు ఐదు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ తాసిల్దార్ విష్ణువర్ధన్ రావు, గిర్దావరులు శివన్న గౌడ్, వెంకటేష్ కార్యాలయం సిబ్బంది మల్లేష్ నాయుడు, ప్రసన్న,జ్ఞానేశ్వర్, రాముడు ఎండీ కాజా పాల్గొన్నారు. అదే విధంగా అంబేదర్ చౌరస్తాలో జానపద కళాకారుల బృందం ఆధ్వర్యంలో అమరవీరులకు ఐదు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు.


వెల్దండలో..


తెల్కపల్లిలో..

27న జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

నవతెలంగాణ -కందనూలు

విద్యార్థులలో బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక లావాదేవీలు, సైబర్‌నేరాలు, ఆర్బిఐ సూచనలు, సలహాలు మరియు ఆర్థికపరమైన అంశాలలో ముడిపడిన జీవనశైలి మొదలైన అంశాలలో అవగాహన కల్పించి చైతన్యం నింపడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న 8,9, 10వ తరగతి విద్యార్థులకు ఆల్ ఇండియా క్విజ్ ఆన్ ఫైనాన్స్ లిట్రసి బి2023 కార్యక్రమాన్ని లీడ్ బ్యాంకు మేనేజర్ కార్యాలయం ద్వారా మండలస్థాయిలో, జిల్లాస్థాయిలో క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నారని డీఈవో డాక్టర్ గోవిందరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి క్విజ్ పోటీలు 27న 12 కేంద్రాలలో జిల్లా స్థాయి పోటీలు 04.07.2023 న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించబడును. వివరాలకు జిల్లా సైన్స్‌అధికారి కృష్ణారెడ్డి 9989921105నంబర్‌ను సంప్ర దించాలన్నారు.

నవోదయకు కేకే రెడ్డి విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ- తెలకపల్లి

జవహర్ నవోదయ పాఠశాలకు మండల కేంద్రానికి చెందిన కేకే రెడ్డి పాఠశాల విద్యార్థి ఆవుల గిరిజ శ్రీ ఎంపికైనట్లు పాఠశాల సలహాదారులు కే రఘురాం రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నిర్వహించిన నవోదయ ఎంట్రన్స్‌లో విద్యార్థి గిరిజ శ్రీ అత్యంత ప్రతిభ కనబరిచి ర్యాంకు సాధించి సీటు పొందినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా నవోదయ పాఠశాల సీటు సాధించిన విద్యార్థిని గిరిజ శ్రీ పాఠశాల ప్రిన్సిపల్ బాలు ఉపాధ్యాయులు అభినందించారు.

దశాబ్ది ఉత్సవాల పేరుతో దగా..





- ఉత్సవాల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం
- డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ

నవతెలంగాణ -అచ్చంపేట

తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలు దశాబ్ది దగా పేరుతో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పిలుపు మేరకు గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. దశాబ్ది దగా పేరుతో కేసీఆర్, స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు దిష్టి బొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.. ఏం సాధించారని తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు చేసుకుంటున్నారని, ఉత్సవాల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో ఏర్పడిన తెలంగాణరాష్ట్రంలో ఇప్పటివరకు ఏవి కూడా అమలకు నోచుకోలేదన్నారు. ఏ రంగాల్లో ఏమాత్రం అభివృద్ధి చెందకుండా.. ప్రజలందరిని మోసం చేస్తూ మరోసారి గద్దెనెక్కెందుకు శతాబ్ది ఉత్సవాల పేరుతో హంగామా ఆర్భాటాలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకుడు కాంగ్రెస్ పార్టీ నేత గంగాపురం రాజేందర్, పట్టణ అధ్యక్షులు రఘురాం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరసయ్య యాదవ్, అమ్రాబాద్ ఎంపీపీ శ్రీనివాసులు, కౌన్సిలర్ గౌరీ శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామనాథం, వెంకట్ రెడ్డి, హరి నారాయణ గౌడ్, కాశన్న యాదవ్, మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

కందనూలు: టీపీసీసీ రేవంత్‌రెడ్డి పిలుపుమేరకు జిల్లా కేంద్రంలో మాజీ మంత్రివర్యులు డాక్టర్ నాగం జనార్దన్ రెడ్డి నివాసం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలతో ర్యాలీగా బయలుదేరారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడి నుంచి బస్టాండ్ ఆవరణలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ మంత్రివర్యులు డాక్టర్ నాగం జనార్దన్‌రెడ్డి , టీపీసీసీ జనరల్ సెక్రెటరీ రఘువీరారెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, అధికార ప్రతినిధి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ నాగం శశిధర్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నాగం జనార్దన్ రెడ్డి మాట్లా డుతూ.. తెలంగాణ రాష్ట్రం సిద్ధించి తొమ్మిదేళ్ల అయినా తెలంగాణ రాష్ట్రప్రభుత్వం మాత్రం ఈ నెల 2 నుంచి 22 వరకు ప్రజాధనాన్ని దుర్వినియోగపరుస్తూ తన పార్టీ ప్రచారానికి దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటుందన్నారు. తెలంగాణ సా ధిస్తే గద్దెనెక్కిన కేసీఆర్ ప్రభుత్వం గత తొమ్మిదేళ్లు దాటినా ఆశయసాధన దిశగా చేసిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రుణమాఫీని తక్షణమే అమలు చేయాలి



కొల్లాపూర్ : రైతులకు రుణమాఫీని తక్షణమే అమలు చేసి రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి బి బాల పీర్ అన్నారు. గురువారం మండల రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఎదుట రుణమాఫీ చేయాలని ధర్నా చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికల ముందు రైతన్నకి లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. నేడు రైతుల రుణమాఫీ చేయకపోవడంతో తీసుకున్న అప్పు కన్నా మూడింతలుగా వడ్డీ అయిందన్నారు. అప్పు కట్టాలని బ్యాంకర్లు వేధించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే అసలు వడ్డీని పూర్తిస్థాయిలో మాఫీ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు సేవ్య నాయక్, కిరణ్ కుమార్, రవి, రాములయ్య, వెంకటయ్య, లింగస్వామి, ఆంజనేయులు, చంద్రు, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

అలుపెరుగని పోరాటాల ఫలితమే తెలంగాణ



నవతెలంగాణ - తిమ్మాజిపేట

ఎన్నో సంవత్సరాల పోరాటం ఫలితం ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితం తెలంగాణ అని ఎంపీపీ రవీంద్రనాథ్ రెడ్డి, జెడ్పీటీసీ దయాకర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గురువారం ఎంపీడీవో కార్యాలయంలో అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ప్రజాప్రతినిధులు అధికారులు రెండు నిమిషాల పాటు అమరులకు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ తొలిదశ మలిదశ ఉద్యమంలో ఆసువులు బాసి తెలంగాణ సాధించారని తెలంగాణ వస్తే ఈ ప్రాంతం అన్ని వర్గాల ప్రజలకు బతుకుదెరువు బాగుంటుందని ఆశించి ప్రజలు ప్రాణాలకు తెగించి పోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, తాసిల్దార్ సరస్వతి, ఎంపీడీవో కరుణశ్రీ, ఎంఈఓ శ్రీనివాసులు, పశు వైద్యాధికారి శ్రీవాణి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

ఉన్నత చదువులకు ప్రయత్నిస్తా..

నవతెలంగాణ -బల్మూరు

అమ్మానాన్నల ఆశీర్వాదం గ్రామస్తులందరి సహకారం తో ఉన్నత చదువులు చదివేందుకు ప్రయత్నిస్తానని జేఈఈ ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో మొదటి ర్యాంకు సాధించిన చిద్విలాస్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని గోదల్‌లో సన్మాన కార్యక్రమం అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పాల్గొన్నారు. జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ జేఈఈ పరీక్ష ఫలితాలలో ఉత్తమ ర్యాంక్ సాధించిన మండలం గోదల్ గ్రామానికి చెందిన వావిలాల రాజేశ్వర్ రెడ్డి కుమారుడు చిధిల్వాస్ రెడ్డి గొప్ప శుభ పరి ణామమని ఎమ్మెల్యే అన్నారు. గురువారం గోధల్ గ్రామంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్నేహితుల బ్యాడ్మింటన్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

అచ్చంపేట : స్నేహితుల బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్‌సీ నాయక్, ప్రధాన కార్యదర్శులుగా బి. జనార్ధన్, ఉపాధ్యక్షుడిగా ఎస్. సీతారాం, కో-శా ధికారిగా శ్రీను, గౌరవ అధ్యక్షుడిగా భీష్మ నాయక్, సలహాదారుడిగా జి. దశరథం, ఆర్ కృష్ణ, జి. నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పంచాయతీ కార్మికులకు వేతనాలివ్వాలి



నవతెలంగాణ -కొల్లాపూర్

మున్సిపాలిటీ తరహాలో గ్రామపంచాయతీ లో పనిచేస్తున్న కార్మికులకూ సమాన వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి ఈశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోకి తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) సమ్మె నోటీసులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. నూతన పీఆర్సీ ప్రకారం జీవో నెంబర్ 60 అనుసరిస్తూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు 15,600, 19,000, 26000 ఇస్తున్నారన్నారు. మున్సిపాలిటీకి సమానంగా గ్రామ పంచాయతీలో అదే స్థాయిలో గ్రామపంచాయతీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారన్నారు. చేసేది ఒకటే పని అయినప్పుడు గ్రామపంచాయతీ కార్మికులకు పీఆర్సీ పరిధిలోకి తేకుండా 8500 ఇవ్వడం తగదన్నారు. జీవో నెంబర్ 51 వచ్చినకానుంచి మల్టీపర్పస్ పేరుతో కార్మికులు గొడ్డు చాకిరి చేస్తున్నారన్నారు. జులై 6నుంచి రాష్ట్రవ్యాప్తంగా జేఏసీ పిలుపుమేరకు సమ్మెలోకి వెళ్తున్నట్టు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జల్లాపురం సురేందర్, గ్రామపంచాయతీ మండల నాయకులు రాఘవేంద్ర, నాగరాజు, బాలస్వామి, వెంకట్, సహదేవుడు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డికి రాష్ట్రస్థాయి ప్రశంస

నవతెలంగాణ -కందనూలు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వాళ్లలోని ప్రతిభను బయటపడేలా సైన్స్ కార్యక్రమాలను జిల్లాలో వారీగా నిర్వర్తిస్తూ విద్యార్థులు సరికొత్త ఆవిష్కరణలను రూపొందించేందుకు కృషిచేస్తున్న జిల్లా సైన్స్ అధికారికృష్ణారెడ్డిని హైదరాబాద్‌లో అభినందించి సత్కరించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా స్కూల్ ఇన్నోవే షన్ చాలెంజ్‌ను నిర్వహిస్తుందన్నారు. విద్యార్థి దశలోనే ఆవిష్కరణలు చేసేలా వారికి ప్రోత్సహించేందుకు తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ పనిచేస్తుందని జిల్లా సైన్స్‌అధికారి కృష్ణారెడ్డి అన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో తెలంగాణ స్కూల్ ఇన్నోవేషన్ కార్యక్రమం రాష్ట్రస్థాయి ప్రదర్శనలో భాగంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలను అందజేశారన్నారు.

అధికారుల తీరు మార్చుకోవాలి

• రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ. విజయలక్ష్మి



నారాయణపేట టౌన్ : చిన్న చిన్న విషయాలకు మెమోలు, రివ్యూ చేస్తూ అంగన్వాడీలను ఆందోళన గురిచేస్తున్న అధికారులు తమ తీరును మార్చుకోవాలని , ఇచ్చిన మేమోలు వెనక్కి తీసుకోవాలని , తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ. విజయలక్ష్మి అన్నారు. లేనిపక్షంలో అంగన్వాడీలు ఉద్యమించక తప్పదని హెచ్చరించారు.150 మందికి మేమోలు, 7 మందిని రివ్యూ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ నెంబర్ 14 ను రద్దు చేయా లని డిమాండ్ చేశారు . రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీల సమస్యలపై నిర్వహి స్తున్న జీపు జాతలో గురువారం నారాయణపేట జిల్లాకు చేరుకున్నది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు ముందర అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి మంజుల అధ్యక్షతన జరిగిన సభలో ఆమె ప్రసంగించారు.తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు జీ. వెంకట్రామరెడ్డి, సీఐటీయూ జిల్లా కన్వీనర్ బాల్‌రామ్, సీఐటీయూ జిల్లా నాయకులు జోషి, గోవిందరాజు వికలాంగుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షులు కే. కాశప్ప అంగన్వాడి యూనియన్ నాయకులు రాధమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీయూనియన్ నాయకులు మంజుల ,రాధిక, మణెమ్మ ప్రసన్న సునంద, లక్ష్మీదేవితోపాటు 100 మంది అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలి



గట్టులో..



అలంపూర్‌లో..

గట్టు : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లు , ఇండ్ల స్థలాలు ఇవ్వాలని తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో గట్టు మండలంలోని తాహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తాహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నరసింహ మాట్లాడుతూ మాటలు కోటలు దాటుతున్నా.. చేతలు మాత్రం గడప దాటడం లేదన్న చందంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. అర్హులైన పేదలందరికీ ఇండ్లు,ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గృహలక్ష్మి పథకం కింద ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల 50 వేల రూపాయలు ఇవ్వాలన్నారు.లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో పేద ప్రజలే టీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఏ నర్మదా, కేవీపీఎస్ జిల్లా నాయకుడు ఆంజనేయులు, హమాలీ సంఘం నాయకులు ఈరన్న, వెంకటేశు, ప్రజాసంఘాల నాయకులు నరసింహ, రెడ్డప్ప, ఉరుకుందు, బజారన, ఈరమ్మ, లక్ష్మి, రాముడు పాల్గొన్నారు.

అలంపూర్ : ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని అలంపూర్ మున్సిపల్ టౌన్ లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం తాహసీల్దార్ సుభాష్ నాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జీ. రాజు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వీ.నరసింహ పాల్గొని మాట్లాడారు. జూలై 3న గద్వాల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ మండల కార్యదర్శి కె నాగరాజు, అధ్యక్షుడు కె. వెంకటస్వామి, నాయకులు సిద్ధయ్య, ఏలీయా, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆశన్న సీఐటీయూ నాయకులు మాలిక్, రఫీ, అల్లభకాష్ తదితరులు పాల్గొన్నారు.

హామీని నిలబెట్టు కోవాలి

• ప్రజా సంఘాల పోరాట వేదిక



నారాయణపేట టౌన్ : ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల పరిధిలోని అయ్యావారి పల్లి, దామరగిద్ద తండాలో అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ గురువారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు అంజిలయ్యగౌడ్, జోషి మాట్లాడుతూ పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని విస్మరించారని అన్నారు. గృహలక్ష్మి పథకం కింద అర్హులైన వారందరికి ఇండ్ల నిర్మాణం కోసం ఆర్థిక సహాయం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం దామరగిద్ద తాహసీల్దర్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో దరఖాస్తులతో రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ముస్తపెట్ సర్పంచ్ లాలు ప్రసాద్, అరుణ్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఒలంపిక్ డే రన్ ..



నారాయణపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియం మైదానంలో అదనపు ఎస్పీ నాగేం ద్రుడు గురువారం ఒలంపిక్ డే రన్‌ను జెండా ఊపి ర్యాలీని ప్రారం భించారు. స్పోర్ట్స్ అథారిటీ వారి ఆదేశాలతో రాష్ట్ర ఒలంపిక్ డే రన్ ను నిర్వహి ంచారు. ఈ కార్యక్ర మంలో సీఐ రవి బాబు, , రిటైర్డ్ పీఈటీ నరసింహులు ఎస్జీఎఫ్ సెక్రెటరీ నరసింహులు, వాలీబాల్ సంఘం సెక్రెటరీ అమరేష్, జనార్ధన్, డివైఎస్ఓ ఆఫీస్ ఇంచార్జ్ సాయినాథ్, పిఇటి లు ఆంజనేయులు బాల్ రాజ్, వెంకటప్ప, అనంత సైన్, రామకృష్ణ, పర్వీన్ బేగం, భీమ్ రెడ్డి ,అజిత్ కుమార్, మైనార్టీ స్కూల్ , కాలేజీ విద్యార్థులు, క్రీడాకారులు, యువకులు తదతరులు పాల్గొన్నారు.

బీఎస్పీని బలోపేతం చేయాలి

• గద్వాల నియోజకవర్గంలో బల్గేరా రాజు

గట్టు : బీఎస్పీని బలోపేతం చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ గద్వాల నియోజకవర్గ అధ్యక్షులు బలిగేరా రాజు కోరారు.గురువారం బహుజన పల్లె బాటలో భాగంగా గట్టు మండలం తప్పెట్లమోర్స్ గ్రామంలో పార్టీ నాయకులు. బీఎస్పీ నియోజకవర్గ కోశాధికారి వెంకటేష్ నాయక్, బీఎస్పీ గట్టు మండల అధ్యక్షులు గట్టు వాసు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో బహుజనలు అసెంబ్లీలో అడుగు పెట్టనున్నారన్నారు.ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనార్టీల, అగ్రకుల పేదల సంక్షేమంకై అలుపెరుగని పోరాటం చేస్తున్న ఒకే ఒక పార్టీ బహుజన్ సమాజ్ పార్టీ మాత్రమేని అన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం ..

గట్టు : మండలంలోని చాగదోన గ్రామంలో బసవన్న ఆలయ నిర్మాణానికి కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు వీరుబాబు రూ.50,116ల నగదును ఆలయ కమిటీ వారికి అందజేశారు.ఈ కార్యక మంలో వెంకటపతి నాయుడు , గద్వాల్ మండల అధ్యక్షుడు పూడూరు రఘునాయుడు , వాల్మీకి సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి : కలెక్టర్



నారాయణపేట టౌన్ : పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం పట్టణంలోని స్కిల్ సెంటర్లో సమగ్ర శిక్ష నారాయణపేట కలెక్టర్ సౌజన్యంతో వెలుగు అభ్యసన మిత్ర వర్క్ బుక్ కార్యక్రమం పై 4,5 తరగతులకు బోధించే తెలుగు, ఆంగ్లం, గణితం బోధించే అభ్యసన సామర్థ్యాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు తరచుగా నిర్వహించుకోవడం వల్ల విద్యార్థులకు బోధించే బోధన తదితర సమస్యలు తెలుస్తాయని, తరచూ తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలన్నారు. బోధించిన సబ్జెక్టుల వారీగా ఫీడ్ బ్యాక్ ఉండాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్, డిఈవో రవీందర్, టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధనలో ..

అమరుల త్యాగాలు చిరస్మరణీయం

• తెలంగాణ అమరుల సంస్మరణ దినోత్సవంలో వక్తలు



గద్వాలలో..



నారాయణపేటలో..

జోగులాంబ గద్వాల : తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరుల త్యాగాలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు.గురువారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన తెలంగాణ అమరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని స్మృతి వనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం , మున్సిపల్ చైర్మన్ బి ఎస్ కేశవ్ , గ్రంథాలయ చైర్మన్ జంబు రామన్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్ గౌడ్, కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ అపుర్వ్ చౌహాన్‌లతో కలిసి అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు.తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరవీరుల త్యాగాలు మరువలేనివన్నారు.వారి త్యాగాలకు ఫలితంగా తెలంగాణాలో వారికీ నివాళులర్పించు కుంటున్నామని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో అమరుల త్యాగాల ఫలితంగానే రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెల్లాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. జిల్లా అభివృద్ధి జరగాలంటే మీ అందరి సహకారం ఉండాలని అన్నారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడి 9 సంత్సరాలు పూర్తి చేసుకొని 10 వ సంవత్సరంలో ఉన్నందున, 9 సంవత్సరాలు సాదించిన ప్రగతిని జూన్ 2 నుంచి 22 వరకు దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నామని తెలిపారు. చివరి రోజు అమరుల సంస్మరణ సభ నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం దాదాపు 1200 మంది విద్యార్థులు తమ ప్రాణాలు అర్పించి అమరులయ్యారని, వారిని ఈ సందర్భంగా స్మరించుకోవటం అభినందనీయమని అన్నారు. తెలంగాణా ఇంజినీర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్యాం సుందర్ రెడ్డి, వెంకట్ రంగ రెడ్డి, మోహన్ రావు తదితరులు మాట్లాడారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన తెలంగాణా రాష్ట్ర ఉద్యమం లో అమరులైన పాశం సర్వా రెడ్డి, కొట్టం వేణుగోపాల్ విగ్రహాల ఆవిష్కరించి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గద్వాల్ తాహసీల్దారు వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ నర్శిములు ,రమేష్, మోహన్ రావు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, అమరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ..

జోగులాంబ గద్వాల్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పటేల్ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో తొలి దశ ఉద్యమంలో ప్రాణ త్యాగాలు చేసిన పాశం సర్వారెడ్డి, కొట్టం వేణుగోపాల్ విగ్రహావిష్కరణలో కాంగ్రెస్ నాయకులు పాల్గొని పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బల్గెర నారాయణ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రాజీవ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వీరు బాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నల్లారెడ్డి మరియు గౌస్, గద్వాల్ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ కౌన్సిలర్ ఇసాక్ అన్న గారు, జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్ మరియు జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ షేక్ జమాల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అలెగ్జాండర్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రాజేంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళి

నారాయణపేటటౌన్ : తెలంగాణ అమరవీరుల త్యాగ ఫలితం వల్లే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని జెడ్పీ చైర్పర్సన్ కే. వనజ ఆంజనేయులు గౌడ్ అన్నారు. గురువారం జెడ్పీ కార్యాలయంలో అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని అమరవీరులకు నివాళులర్పించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబాలను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జెడ్పీ చైర్ పర్సన్, కలెక్టర్ మాట్లాడుతూ అమరుల త్యాగాల ఫలితం వల్లే మనకు తెలంగాణ సిద్ధించిందని అన్నారు. అమరులను మనం ఎల్లప్పుడూ సంస్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్, జెడ్పీ వైస్ చైర్మన్ సురేఖ, జిల్లా అధికారులు గోపాల్, యాదగిరి, నరేందర్, హతిరం, జెడ్పీటీసీలు అంజలి రాములు ముదిరాజ్, లావణ్య, సూర్య ప్రకాష్ రెడ్డి, అశోక్ గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నర్వ: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కే. జయరాములు శెట్టి ఆధ్వర్యంలో అమరవీరులకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీణావతి, ఎంపీడీవో రమేష్ కుమార్, ఎంపీ ఓ వేణుగోపాల్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది బాలాజీ గౌడ్, ఈజీఎస్ సిబ్బంది, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమరవీరుల దినోత్సవం

గట్టు : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అమరవీరుల దినోత్సవం పురస్కరించుకుని ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అమరులకు నివాళులర్పిస్తూ తీర్మానం ప్రవేశపెట్టి తీర్మానాన్ని అమరల అమరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ తీర్మానాన్ని ఆమోదించారు. బాసు శ్యామల , మేకల సుమతి , ఎంపీడీవో చెన్నయ్య , తాహసీల్దార్ జుబేర్ అహ్మద్ , జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ ఇమామ్ , ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ వర్కర్లకు సన్మానం..

గట్టు మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ధనలక్ష్మి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మల్టీపర్పస్ వర్కర్లను పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో. గ్రామపంచాయతీ కోఆప్షన్ సభ్యులు సత్యనారాయణ , పంచాయితీ కార్యదర్శి జగన్నాథం రావ్, సీనియర్ సిటిజన్ గోవిందప్ప , ఏఈఓ తోయదు దొరబాబు , కే రమేష్ , టీ నాగరాజు, దేవన్న , గోపాల్ ,గుమ్మడికాయలక్ష్మణ్, గ్రామస్తులు , యువకులు తదితరులు పాల్గొన్నారు.

మరికల్ : మండల కేంద్రంలో పోలీస్ శాఖ కార్యాలయాల్లో, తాహసీల్దార్ కార్యాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయం, గ్రామపంచాయతీ, వివిధ ప్రభుత్వ కార్యాలయంలో అమరవీరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.తాహసీల్దార్ రామకోటి అమరవీరులు చేసిన త్యాగాలు మరువలేనివని గుర్తు చేశారు .అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ కే గోవర్ధన్ అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని వివిధ గ్రామాలలో అమరవీరుల దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యశోదమ్మ ఏపీఓ బాలాజీ పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాసరావు, ,ఎంపీటీసీ సీమ గోపాల్, సుజాత శ్రీనివాసులు, యూత్ అధ్యక్షులు రాజేష్, వార్డ్ మెంబర్లు, ఆశా వర్కర్లు గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామపెద్దలు యువకులు పాల్గొన్నారు.

ధరూర్ : ధరూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అమరవీరులకు నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఎంపీపీ నజుమున్నిస బేగం, జెడ్పీటీసీ పద్మ వెంకటేశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, ఎంపీడీవో అబ్దుల్ జబ్బార్, ఏంఈఓ సురేశ్, ఎంపీటీసీలు, సర్పంచ్ లు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఎంపీపీ నజుమున్నిస బేగం అధ్యక్షతన జరిగిన సమావేశంలో అమరులకు నివాళులర్పిస్తూ తీర్మానం ప్రవేశపెట్టి తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఉండవల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు ఎంపీపీ బీ సమ అధ్యక్షతన ఘనంగా నివాళులర్పించి మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అంజిరెడ్డి, ఏ పీ ఓ శివ శంకర్ నాయక్, జూనియర్ అసిస్టెంట్ భాస్కర్ ఆచార్య, పంచాయతీ కార్యదర్శులు , మండల అధికారులు పాల్గొన్నారు.

అమరుల ఆత్మ శాంతించాలని..

మల్దకల్ : తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అమరవీరుల స్తూపం ప్రారంభ కార్యక్రమం సందర్భంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం అసువులు బాసిన అమరవీరులను స్మరించుకొని వారి ఆత్మకు ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అదేవిధంగా అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తామని నినదించారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కే. నరసింహులు , అధ్యాపకులు రామాంజనేయులు గౌడ్, తిమోతి, జయరాం, శ్రీనాథ్, ఆంజనేయులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో..

మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని అమరవీరుల స్థూపం , చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాహసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీవో జీ. కృష్ణయ్య సీడీపీఓ కమలాదేవి, సర్పంచ్ యాకోబు, ఎంపీటీసీ జయమ్మ నరసింహులు ఎంపీటీసీ రాజు, ఎంఆర్ఐ రామకృష్ణ, ఆర్ ఐనాగిరెడ్డి, సూపరింటెండెంట్ పెద్ద నరసన్న, సీనియర్ అసిస్టెంట్ సూర్య ప్రకాష్‌రెడ్డి, ఏపీఎం సాంబశివుడు, పంచాయతీ కార్యదర్శి మాబి, టెక్నికల్ అసిస్టెంట్లు నాగరాజు, ఇబ్రహీం, అనుష, సీనియర్ అసిస్టెంట్ అశోక్, బీఆర్ఎస్ నాయకులు చెట్టు కింద గోవిందు, తిమ్మప్ప, కిష్టన్న నరసింహులు, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.



మల్దకల్‌లో..



నర్వలో..



ఉండవల్లిలో..



ధరూర్‌లో..



గట్టులో..



మరికల్‌లో..

కళాశాల మైదానాన్ని కాపాడాలని వినతి



ధన్వాడ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని భూకబ్జాదారుల ప్రబంధహస్తాల నుండి కాపాడాలని కోరుతూ.. ప్రగతి శీలా ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బీ భాస్కర్ , జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ ధన్వాడ మండల కేంద్రంలో సర్వేనెంబర్ 34,35 లో ప్రభుత్వ విద్య సంస్థల అభివృద్ధి కోసంగతంలో 14 ఎకరాల భూమిని గ్రామకంఠం నుంచి ప్రభు త్వం కేటాయించడం జరిగిందని, అయితే అందులో ప్రభుత్వ హాస్టల్, వ్యవ సాయ మార్కెట్, కాలేజ్, హై స్కూల్, లైబ్రరీ, వెటర్నరీ ఆఫీసులను నిర్మిం చినట్లు పేర్కొన్నారు. అయితే ధన్వాడ మండల కేంద్రానికి గత సంవత్సరం కేటాయించిన ప్రభుత్వ డిగ్రీ కాలేజీని నిర్మించే స్థలంలో కొంతమంది రాజకీయ నాయకుల ప్రోద్భలంతో ఆక్రమించుకుం టున్నారన్నారు.వెంటనే ప్రభుత్వ విద్యాసంస్థలకు కేటాయించిన భూమిని ఆక్రమిస్తున్న భూ కబ్జాదారుల కబంధహస్తాల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడి కోరారు. లేని పక్షంలో ఇతర సంఘాలను కలుపుకొని తమ సంఘం ఆధ్వర్యంలో ఉద్య మాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీ ఎస్‌యూజిల్లా నాయకులు కురుమూర్తి , పీవై ఎల్ జిల్లా నాయకులు శ్రీనివాస్ , నాయకులు నరేష్, మహేష్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుల సంఖ్య పెంచాలి : పీడీఎస్‌యూ

నారాయణపేట టౌన్ : పేట జిల్లాకు టీయస్ ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ డిమాండ్ చేశారు.గురువారం నారాయణపేట జిల్లా టీఎస్ ఆర్టీసీ డిపోకు టీఎస్ ఆర్టీసీ ఎగ్జికిటివ్ డైరె క్టర్ హైద్రాబాద్ జోన్ డైరెక్టర్ ఈడీ ఎ.పురుషోత్తం వచ్చిన సందర్భంగా పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వినతి పత్రం సమ ర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాకు అద నంగా ఆర్టీసీ బస్సులు కేటాయించి విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా ఆర్టీసీ బస్సులను ప్రతి గ్రామానికి టైం కు అనుకూలంగా నడపాలని కోరారు. ఇందుకు స్పందించిన ఈడీ తప్పకుండా సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని అన్నారు.



సీఎం సహాయనిధి చెక్కు అందజేత



జోగులాంబ గద్వాల : గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల మండలంలోని జిల్లేడు బండ గ్రామానికి చెందిన శ్రీలత కు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. లక్ష 25 వేల ఎల్ఓసీ లెటర్‌ను ఎమ్మెల్యే బండ్లకృష్ణమోహన్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు ప్రభాకర్ రెడ్డి, రాజశేఖర్, సర్పంచ్ వాసు , బీ ఆర్ఎస్ నాయకులు రమేష్ నాయుడు , కురుమన్న పాల్గొన్నారు.

గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం



ఊట్కూర్ : మన ఊరు పిల్లలందరూ మన ఊరి బడిలోనే చదువుకోవాలని గురువారం కొత్తపల్లి గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానించారు. కొత్తపల్లి మండల పరిషత్ పాఠశాలలో పేరెంట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో మన ఊరి పిల్లలందరూ మన ఊరి బడిలోనే చదువుకోవాలని గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం చేసి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య దాదాపు 70మంది చేరినట్లు ఉపాధ్యాయుల బృందం సభ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామానికి ప్రైవేటు వాహనాలు రాకుడదని గ్రామస్తుల సమిష్టి నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ అమరుల దినాన్ని పురస్కరించుకుని అమరులకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శాంతమ్మ , ఉప సర్పంచ్ అంజమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్ , ఉపాధ్యాయురాలు శ్వేత, పంచాయితీ కార్యదర్శి సాయినాథ్ , వార్డు సభ్యులు రామాంజనేయులు, ఎస్ఎంసీ చైర్మన్ చిన్న నర్సింహులు, ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీసీ డ్రైన్‌కు భూమిపూజ

ఊట్కూర్ : మండలంలోని తిప్రస్‌పల్లిలోని ఆర్ అండ్‌బీ రోడ్డు నుంచి శివమూల నర్సింహులు ఇంటి సమీపం వరకు గురువారం సీసీడ్రైన్ నిర్మాణానికి సర్పంచ్ సుమంగళ, ఎంపీటీసీ రవికుమార్ , బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సురేష్‌లు గురువారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు లక్ష్మి, అంజిలమ్మ , గ్రామ పెద్దలు , కోల నర్సింహులు , సాకలి సుభాష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల పేరిట దగా ..



కోస్గి : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ప్రజాధనంతో చేయడంతో పాటు ప్రజలను దగా చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అన్నారు. గురువారం మున్సిపా లిటీ కేంద్రంలోని శివాజీ చౌరస్తాలోని మహబూబ్‌నగర్ – తాండూర్ ప్రధాన రహదారిపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో పోరాడి సాధించిన తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం అన్ని రంగాలలో ప్రజలను వంచించి దగా చేసిందన్నారు. అనంతరం కేసీఆర్ చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ కార్యక్రమంలో వార్ల విజయకుమార్, రఘు వర్ధన్ రెడ్డి, బెజ్జు రాములు, తుడుం శ్రీనివాస్, బెంటు నరసింహ, గోవర్ధన్ రెడ్డి, భాను నాయక్, నాగులపల్లి నరేందర్, సలీం, ఫెరోజ్, సురేష్ కుమార్, గిరిధర్ రెడ్డి, సోమశేఖర్ ,విద్యాసాగర్ ఉన్నారు.

మాజీ చైర్మన్‌ను కలిసిన నర్వ వాల్మీకులు

నర్వ: నర్వ మండల పీఏసీఎస్ మాజీ చైర్మన్ బంగ్లా లక్ష్మీ కాంత్ రెడ్డి నీ గురువారం నర్వ గ్రామ వాల్మీకి నాయకులు హైదరబాద్ లోని ఆయన నివాసంలో కలిశారు .చైర్మన్ పదవి పై పాలక వర్గ అవిశ్వాస తీర్మానాన్ని పెట్టడం జరిగింది. అవిశ్వాసానికి ముందే అధ్యక్ష పదవికి రాజీనామాను చేశారు. రాజీనామా అనంతరం మండల రాజకీయాలకు దూరంగా ఉన్నారు. వెన్నుపోటు రాజకీయాలకు భయపడకుండా రాజకీయంగా ముందుకు వెళ్లాలని, ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా పోరాడి ముందుకెళ్ళి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలనీ వాల్మికి నాయకులు భరోసానిచ్చారు. సొసైటీ పరిధిలో వరి ధాన్యం విక్రయించిన రైతులకు ట్రాన్స్‌పోర్టేషన్ డబ్బులను రైతుల అకౌంట్ లలో వేయించే వరకు విశ్రమించవద్దన్నారు. రాజకీయంగా ఎల్లపుడూ మీవెంటే మేము ఉంటామన్నారు.